తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 వార్త
1996 - 2026

# యువతే దేశ దిక్సూచి..

## సేవా భావంతో ముందుకు సాగాలి : గవర్నర్







తిరుపతి విద్య, మార్చి 30 ప్రభాతవార్త

యువతే దేశ భవిష్యత్తుకు దిక్సూచి అని, విద్య ద్వారా సంపాదించిన జ్ఞానాన్ని సమాజ సేవకు వినియోగించాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన 13వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్నాతకోత్సవం విద్యార్థుల జీవితంలో కీలక మలుపు అని పేర్కొన్న గవర్నర్, కష్టపడి చదివి పట్టాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వారి విజయాల్లో తల్లిదండ్రులు, గురువుల పాత్ర అమూల్యమని తెలిపారు. యువతలో ఉన్న శక్తి, సృజనాత్మకత దేశ అభివృద్ధికి దోహదపడతాయని, నైతిక విలువలు పాటిస్తూ సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యార్థులు కొత్త నైపుణ్యాలను అభ్యసిస్తూ సమాజానికి ఉపయోగపడే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మొత్తం 415 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయగా, ప్రతిభ కనబరిచిన 38 మందికి బంగారు పతకాలు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహారాష్ట్ర అనిమల్ అండ్ ఫిషరీస్ సైన్సెస్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా. నితిన్ వి. పాటిల్ మాట్లాడుతూ, పశుసంపద రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారమని పేర్కొన్నారు. గ్రామీణ కుటుంబాల జీవనాధారంగా ఈ రంగం కొనసాగుతోందని, ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ (ఎ ఐ ) వినియోగంతో మరింత అభివృద్ధి సాధ్యమని తెలిపారు. పట్టభద్రులు ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా, స్టార్టప్‌ల ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించే దిశగా ముందుకు రావాలని సూచించారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జె.వి. రమణ శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో అగ్రస్థానం వైపు దూసుకెళ్తోందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జె.వి. రమణ పేర్కొన్నారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ వర్సిటీ సాధించిన ప్రగతిని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా పశువైద్య విశ్వవిద్యాలయాల్లో 4వ ర్యాంకు సాధించడం, ఐసీఏఆర్ గుర్తింపు పొడిగింపు వర్సిటీ నాణ్యతకు నిదర్శనమని తెలిపారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణం కల్పించేందుకు వర్చువల్ డిసెక్షన్ ల్యాబ్, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, ఆధునిక పరిశోధన సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరంలో 1056 మంది కొత్త విద్యార్థులు చేరారని, భవిష్యత్తులో పట్టభద్రులు ఉద్యోగాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఉపాధి అవకాశాలు సృష్టించాలని ఆకాంక్షి ంచారు. పుంగనూరు ఆవుల సంరక్షణకు లభించిన గుర్తింపు, అంతర్జాతీయ స్థాయి పరిశోధన ప్రాజెక్టులు వర్సిటీ ప్రతిష్ఠను మరింత పెంచుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# టిడ్కో ఇళ్ళకు మౌళిక వసతులు




## - కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు, మార్చి 30 ప్రభాతవార్త:

టిడ్కో ఇళ్ళల్లో నివాసాలు వుండే ప్రజలకు కనీస మౌళిక వసతులు కల్పిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో ఇళ్ళ తాళాలను సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు లబ్దిదారులకు అందజేశారు. రాష్ట్ర స్థాయిలో సిఎం నారా చంద్రబాబునాయుడు నాయుడుపేటలో టిడ్కో ఇళ్ళ లబ్దిదారులకు తాళాలు అందజేయగా చిత్తూరు పూనేపల్లిలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమత్‌కుమార్ మాట్లాడుతూ తాను రాజమండ్రి మున్సిపల్ కమీషనర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో టిడ్కో ప్రాజెక్టు ప్రారంభవమైందని, ఆ సమయంలో తాను ఈ ప్రాజెక్టును క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. చిత్తూరు తేనెబండలో 35.49 ఎకరాల్లో ఇళ్ళ నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, మౌళిక వసతుల కల్పనకు 184.08 కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. ఇక్కడ శానిటేషన్, విద్యుత్, మంచినీటి సమస్య తలెత్తకుండా పక్కాగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ళ లబ్దిదారులు ఇబ్బందులు పడకుండా మౌళిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మున్సిపల్

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రదోష నంది సేవ



శ్రీకాళహస్తి, మార్చి 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం రాత్రి ప్రదోష నంది సేవను కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఉత్సవర్లకు ప్రత్యేకాలంకారాలు నిర్వహించారు. అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను ముస్తాబు చేసారు. పూజలు హారతులిచ్చిన తరువాత ఆలయ ప్రాకారంలో నందిపై ప్రతిష్టించి ఉత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో ఆలయ ఇఓ వెంకటేశులు, ప్రదానర్చకులు కరుణాకర్ గురుకుల్, ఇన్స్పెక్టర్ వెంకటస్వామి ఉద్యోగులు భక్తులు పాల్గొన్నారు.

# గృహ ప్రవేశాల పండుగ

## రాష్ట్రంలో ఈ ఏడాది డిసెంబర్‌లోపు మరో 4.5 లక్షల ఇళ్లు: ముఖ్యమంత్రి చంద్రబాబు





నాయుడుపేట, మార్చి 30, ప్రభాతవార్త

ఈ ఏడాది చివరి నాటికి మరో 4.5 లక్షల గృహాలను పేదవారికి నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ ఏడాది జూన్, సెప్టెంబరు మాసాల్లో గృహ ప్రవేశాలు చేసేలా లబ్దిదారులకు ఇళ్లు ఇస్తామని వెల్లడించారు. కూటమి అధికారంలోకి వచ్చిన 21 నెలల్లో ఇప్పటి వరకూ 5.5 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చామని వివరించారు. నాయుడుపేటలో టిడ్కో ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30కి పైగా చోట్ల నిర్మించిన 2,50,983 టిడ్కో, పీఎంఏవై ఇళ్లను లబ్దిదారులకు అప్పగించారు. తాను హాజరైన ఒక్క తిరుపతి జిల్లాలోనే 15,659 ఇళ్లను నిర్మించి ఇచ్చామని సీఎం వివరించారు. నాయుడుపేటలోని పుదూరు వద్ద జీ ప్లస్ 3 తరహాలో నిర్మించిన భవన సముదాయాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. పార్కులు, వాకింగ్ ట్రాక్, విశాలమైన రహదారులు, అంగన్‌వాడీ, స్కూలు తదితర సదుపాయాలతో నిర్మించిన ఈ టిడ్కో భవనాలను ప్రారంభించిన అనంతరం లబ్దిదారుల గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. హైందవ సంప్రదాయ ప్రకారం నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను బహూకరించారు. అనంతరం మరో ముస్లిం లబ్దిదారు నివాసంలోనూ ప్రార్ధనలు నిర్వహించి నూతన గృహంలో అడుగుపెట్టారు. ఇంటి వెలుపల మహిళా లబ్దిదారు పేరిట ఏర్పాటు చేసిన నేమ్ బోర్డును కూడా ముఖ్యమంత్రి స్వయంగా తగిలించారు. ప్రతీ ఇంటిపైనా పీఎం సూర్యఘర్ కింద సౌర ఫలకాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ పొదుపు చేసే ఉపకరణాలను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియన్సీ సంస్థతో రాష్ట్రం ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం మరికొందరు లబ్దిదారులకు ఇళ్లకు సంబంధించిన స్వాధీన పత్రాలను ఇంటి తాళాలను అప్పగించారు. గతంలో పీఎంఏవై కింద కేంద్రం ఇచ్చిన డబ్బులను కూడా గత పాలకులు దుర్వినియోగం చేశారని సీఎం ఆక్షేపించారు. గత ప్రభుత్వం రూ.816 కోట్ల మేర అప్పు పెట్టిందని, నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్లు కట్టేందుకు ప్రయత్నించిందన్నారు. పేదలు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి కల్పించిందని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. 2029 నాటికి రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు ఉండకూడదన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మొత్తం 17 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, కొలుసు పార్థసారథి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు పార్థసారథి, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### పొరుగు రాష్ట్రాల జాలర్లు మన జలాల్లోకి రానివ్వకుండా కట్టడి

టానమస్ షిప్ యార్డు వల్ల స్థానిక మత్స్యకారులు ఎవరికీ అన్యాయం జరగదని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పొరుగు రాష్ట్రాల జాలర్లు మన జలాల్లోకి రానివ్వకుండా కట్టడి చేస్తామని స్పష్టం చేశారు. నెల్లూరు తీరప్రాంతానికి ప్రత్యేకంగా రెండు గస్తీ బోట్లను మంజూరు చేస్తున్నట్టు వివరించారు. పొరుగు రాష్ట్రాల జాలర్ల కారణంగా స్థానిక మత్స్యకారులకు ఎలాంటి నష్టం జరక్కుండా చూడాల్సిన బాధ్యతను తిరుపతి, నెల్లూరు జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి అప్పగించారు. తమిళనాడు, పాండిచ్చేరి నుంచి వచ్చిన జాలర్లు ఈ ప్రాంతంలో చేపల వేట చేసుకోడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. అవసరం మేరకు మరో 4 బోట్లను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. చేపల వేట నిషేధ సమయంలో జాలర్లకు ఇచ్చే భృతిని మత్స్యకారుల సేవలో పథకం ద్వారా రూ.20 వేలకు పెంచామని, దీని కోసం 1.29 లక్షల మంది కుటుంబాల ఖాతాల్లో రూ.259 కోట్లు జమ చేశామన్నారు. ఇక మత్స్యకారుల పొట్టకొడుతూ గత ప్రభుత్వం తెచ్చిన 217 జీవోను కూడా రద్దు చేసి స్థానిక నీటి వనరుల్లో జాలర్లకే వేట అనుమతిని పునరుద్ధరించామన్నారు.

# పి4తోనే పేదరిక నిర్మూలన

## - జిల్లా స్థాయిలో విశిష్ట మార్గదర్శ పేరుతో ఒక అవార్డు, ముగ్గురికి ప్రశంసా పత్రాలు: సిఎం చంద్రబాబు




తిరుపతి, మార్చి 30ప్రభాతవార్త:

మనమందరం మధ్య తరగతి, పేద కుటుంబాల్లోనే పుట్టామని, అవకాశాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని సిఎం చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. నవసమాజ ఉద్యమానికి ఊపిరి పోయాలనే ఆశయంతో పి4 తీసుకొచ్చామన్నారు. ఇదొక నినాదం కాదని, సామాజిక విప్లవమని అన్నారు. పి4 సేవకులకు పాదాభివందనం చేస్తున్నానని, పేదలను ఆదుకునే ఈ కార్యక్రమం విజయవంతం చేయడం వెనుక అకుంఠిత దీక్ష ఉందన్నారు. ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజం నిర్మాణం కావాలని ఆయన పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన పీ4 వార్షికోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. పి4లో కుటుంబాలను దత్తత తీసుకున్న వారికి జిల్లా స్థాయిలో విశిష్ట మార్గదర్శ పేరుతో ఒక అవార్డు, ముగ్గురికి ప్రశంసా పత్రాలు, నియోజకవర్గ స్థాయిలో ముగ్గరు మార్గదర్శులకు ప్రశంసా పత్రాలు అందిస్తామని వెల్లడించారు. కుప్పంలో మూడు సంస్థలు 8,904 కుటుంబాలను దత్తత తీసుకున్నాయన్నారు. ఈ రాష్ట్రం పై గౌరవం ఉండేవారు ,వారికి తోచిన విధంగా సమాజానికి, కుటుంబాలకు ఉపయోగపడాలని సిఎం పిలుపునిచ్చారు. కనీసం ఒక్క కుటుంబాన్నైనా దత్తత తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. సూపర్ సిక్స్ తల్లికి వందనం, స్త్రీశక్తి, దివ్యాంగశక్తి, మత్స్యకారుల సేవలో, అన్నదాత సుఖీభవ, ఆటో డ్రైవర్ల సేవలో వంటి పథకాలు అమలుచేసి ఏడాదికి 33 వేల కోట్లు రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. నాడు జన్మభూమి కోసం పిలుపునిస్తే ప్రవాస భారతీయులు, పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చి మార్పులు తీసుకొచ్చినట్లే పి4కు ప్రవాసభారతీయులు, అధికారులు, సంపన్నులు కదలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న, జిల్లా మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని, తుడా ఛైర్మన్ సి దివాకర్ రెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, , డి ఐ జీ షిమోజి బాయ్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్ గోవిందరావు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, తిరుపతి నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య ,పి4లబ్దిదారులు పాల్గొన్నారు.

## సాయంకోసం ఆశగా

# అరటి రైతన్న ఎదురుచూపు



రైల్వేకోడూరు రూరల్, మార్చి 30 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలో ఇటీవల ఆకస్మికంగా వీచినా పెనుగాలులకు మండలంలోని దేశెట్టిపల్లి, శెట్టిగుంట, ఎస్సార్ కండ్రిక, విపిఆర్ కండ్రిక, ఉర్లగడ్డ పోడు, రాచపల్లి తదితర ప్రాంతాలలో ఉన్న అరటి పంట ఒకసారిగా పూర్తిగా నేలమట్టం కావడంతో కాయకష్టం చేసి రైతన్నలు ఎంతో ఆశలతో ఉన్న రైతన్నలపై ప్రకృతి కన్నెర్ర చేయడంతో రైతన్నల పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైందని మండలంలోని అరటి రైతులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. వందలాది ఎకరాలలో అరటి పై పెట్టుకున్న ఆశలు ఒక్కసారిగా ఆవిరిపోయారని ఇప్పటికైనా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పంట నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి నష్టపోయిన అరటి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. మండలంలో లక్షలాది రూపాయలు వెచ్చించి అప్పులు తెచ్చి పంటలను సాగు చేయడంతో అప్పు ఎలా కట్టాలో అర్థం కాని స్థితిలో కోడూరు అరటి రైతులు ఆందోళనను కలిగి ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతన్న ప్రభుత్వంగా చెప్పుకుంటున్న సందర్భంలో భారీగా రైల్వేకోడూరు ప్రాంతంలో అరటి రైతులను ఆదుకొని పంట నష్టాన్ని వేగవంతంగా చెల్లించకుంటే కొంతమంది వ్యవసాయ రైతులు ఆత్మహత్యకు కూడా వెనుక ఆడారని బహిరంగంగా రైతన్నలు చర్చించుకుంటున్నారు.

# వసంతమండపంలో వట్టి వేరుల నడుమ సేదతీరిన ఉత్సవర్లు

తిరుమల, మార్చి 30ప్రభాతవార్తప్రతినిధి:



ఎండ వేడి నుండి ఏడుకొండల వేంకటేశ్వకస్వామి ఉత్సవమూర్తులకు ఉపశమనం పొందేందుకు జరిపించే వసంతోత్సవాలు సోమవారం మధ్యాహ్నం వేడుకగా ఆరంభమయ్యాయి. వట్టి వేరు మండపంలో శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి సేదతీరారు. సుగంధాన్ని వెదజల్లే పుష్పాలతోపాటు పలురకాల మధురఫలాలను స్వామివారికి నివేదించారు. వసంతోత్సవాల్లో తొలిరోజు సోమవారం మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం శోభాయమానంగా జీయర్లు, ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం చేపట్టారు. ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను వైఖనసాగమోక్తంగా అర్చకులు చేపట్టారు. స్వామి, అమ్మవార్లు సాయంత్రం అక్కడినుండి బయల్దేరి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, బోర్డు సభ్యులు శ్రీ భానుప్రకాశ్ రెడ్డి, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు , భక్తులు పాల్గొన్నారు.

# సీనియర్లను కాదని జూనియర్ డాక్టర్లకు అందలం

**- అవినీతి బహిర్గతం అవుతుందని జూనియర్లలో గుబులు**
**- డిఎంహెచ్ఓ చేసిన నియామకాలపై రగులుతున్న సీనియర్ డాక్టరు**

చిత్తూరు, మార్చి 30 ప్రభాతవార్త:

జిల్లా వైద్యఆరోగ్యశాఖ పరిధిలోని వివిధ ప్రాజెక్టులకు ప్రాజెక్టు ఆఫీసర్లుగా నియమితులైన డాక్టర్లపై ప్రస్తుతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పలు సీనియర్ డాక్టర్లు వున్నప్పటికీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా జూనియర్ డాక్టర్లకు వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని కీలక విభాగాలకు ప్రాజెక్టు అధికారులుగా నియమించింది. వైద్యశాఖలో ఏ మాత్రం సీనియార్టీ లేకపోయినప్పటికీ జిల్లా స్థాయి పోస్టులకు జూనియర్ డాక్టర్లను నియమించడంతో సీనియర్ డాక్టర్లు అప్పటి నుండి రగులుతున్నారు. సీనియర్ డాక్టర్లను నియమిస్తూ ప్రాజెక్టుల పరిధిలో అమలు అయ్యే ప్రభుత్వ కార్యక్రమాలకు విడుదలయ్యే నిధులు దుర్వినియోగం చేయడానికి అవకాశం వుండదని భావించిన అప్పటి డిఎంహెచ్ఓ తమకు అడ్డుచెప్పకుండా వుంటే జూనియర్లను తెచ్చి ఆ పోస్టుల్లో అదలం ఎక్కించారు. వైద్య ఆరోగ్య శాఖలో అమలు అయ్యే ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రాజెక్టు ఆఫీసర్లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాల్సివుండటంతో ఈ వ్యవహారంపై గత 15 నెలలుగా పొంతన లేకుండా పోయింది. క్షేత్ర స్థాయిలో సీనియర్ డాక్టర్లు పిహెచ్‌సిల్లో విధులు నిర్వహిస్తుండటం, జిల్లా స్థాయిలో జూనియర్ డాక్టర్లు ప్రోగ్రాం ఆఫీసర్లుగా పెత్తనం చెలాయిస్తుండటంతో సీనియర్ డాక్టర్లు ఇప్పటి వరకు అవమానాలు భరిస్తూ వచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లా మలేరియా అధికారి, డిపిఎంఓ, జిల్లా క్షయ నివారణ అధికారి, జిల్లా బాల స్వస్థ కార్యక్రమం, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ తదితర విభాగాలు డిఎంహెచ్ఓ పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తుంటాయి. ఈ ప్రాజెక్టు ఆఫీసర్లు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను నిధులు విడుదల చేయడం, ఆ నిధులు ఎలా ఖర్చు జరిగాయని నివేదికలు తెప్పించుకుని డిఎంహెచ్ఓకు సమర్పించడం చేయాల్సివుంటుంది. అలాగే క్షేత్ర స్థాయిలో అమలు జరుగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలను తనిఖీ చేసి ఎక్కడైనా సక్రమంగా అమలు చేయకుంటే వారిపై చర్యలు తీసుకోవాల్సివుంటుంది. అయితే జిల్లాలో సీనియర్లు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తుండటం, జూనియర్ డాక్టర్లు జిల్లా స్థాయి అధికారులుగా చెలామణి అవుతుండటంతో ఈ మధ్య కాలంలో డిఎంహెచ్ఓ ఎవరిపై చర్యలు తీసుకోలేరు. జూనియర్ డాక్టర్లు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాల్సివుండటంతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు సైతం భవిష్యత్తులో తమ పరిస్థితి ఏమిటని భావించి సీనియర్ డాక్టర్లతో సర్దుబాటు దోరణితో వ్యవహరించారు. జిల్లా మలేరియా ఆఫీసర్ డిఎంహెచ్ఓ పర్యవేక్షణలో విధులు నిర్వర్తించాల్సివుంది. జిల్లా మలేరియా అధికారిగా సీనియర్ డాక్టర్‌ను నియమించాల్సివుండగా ఆ స్థానంలో ఓ జూనియర్ డాక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. జిల్లా స్థాయిలో మలేరియా విభాగానికి జూనియర్ డాక్టర్ వుండటం క్షేత్ర స్థాయి పిహెచ్‌సిలో సీనియర్ డాక్టర్లు విధులు నిర్వహిస్తుండటంతో గత పదిహేను నెలలుగా ఈ విభాగంలో అక్రమాలు భారీగా జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. క్షేత్ర స్థాయిలో జ్వరాలను కట్టడి చేయడానికి జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో నిధులు మంజూరు అవుతాయి. ఈ నిధులను క్షేత్ర స్థాయిలో పిహెచ్‌సి, సబ్ సెంటర్ల స్థాయిలో ఖర్చు చేసి జిల్లా స్థాయి అధికారికి నివేదికలు పంపాల్సి వుంటుంది. అయితే ఈ తతంగం గత 15 నెలల్లో ఎక్కడా పక్కాగా జరుగలేదని ఆరోప ణలు వున్నాయి. డిఎంహెచ్‌లో పరిధిలో మరో కీలక విభాగం డిపిఎంఓ. ప్రస్తుతం డిపిఎంఓగా జూనియర్ డాక్టర్ విధులు నిర్వహి ‌స్తున్నారు. అలాగే జిల్లా బాల స్వస్థ కార్యక్రమం అమలుకు సైతం డిఎంహెచ్ఓ ఓ జూనియర్ డాక్టర్‌కు విధులు అప్పగించారు. ఈ విభాగాలకు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడానికి విడుదల అయిన నిధులను స్వాహా చేయాలని భావించి పక్కా ప్లాన్‌గా ప్రజెక్టు ఆఫీసర్ కుర్చీల్లో తమ మాట వినే జూనియర్ డాక్టర్లను కుర్చోబెట్టి తమకు అనుకూలంగా అన్ని వ్యవహారాలు చేసుకున్నారని ఆరోపణలు వున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఈ విభాగాలతో పాటు జిల్లా క్షయ నిర్మూలన అధికారి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ విభాగంలో సీనియర్ డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరిని తప్పించే అవకాశం లేకపోవడంతో వీరిని మాత్రం అలాగే కొనసాగించి నిధులు పుష్కలంగా ఖర్చు జరిగే విభాగాలకు మాత్రం జూనియర్ డాక్టర్లకు అప్పగించి నిధులను భారీగా దుర్వినియోగం చేశారనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి.

# ముగ్గురు సెక్యూరిటి గార్డుల తొలగింపు

## ఇఓ ప్రత్యేక నిఘా

శ్రీకాళహస్తి, మార్చి 30 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారుల తొలగింపుకు ఇఓ బికె వెంకటేశులు శ్రీకారం చుట్టారు. సోమవారం ముగ్గురు సెక్యూరిటి గార్డులను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారి చేసినట్లు ఇఓ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో సెక్యూరిటి గార్డులు గురవమ్మ, విజయకుమార్,, వెంకటేశ్వర్లును తొలగించినట్లు ప్రకటించారు. వీరు కొందరు భక్తులను దర్శనాలకు తీసుకెళ్లినట్లు కమాండ్‌కంట్రోల్ సిసి కెమెరాల పుటేజీల్లో గమనించి ఇఓ వెంకటేశులు వవెంటనే స్పందించారు. వారిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారి చేసారు. అలాగే కాంటాక్టు సిబ్బంది సి విజయకుమార్ అర్చన కౌంటర్లో పని చేసే కాంటాక్టు ఉద్యోగి, ఔట్ సోర్సింగ్ పెంచులయ్య ప్రసాదం కౌంటర్లో పని చేసే పొరుగు సేవల ఉద్యోగి, వారు విధులు నిర్వర్తించక భక్తులను దర్శనాలకు తీసుకెళుతూ ఉండటాన్ని గుర్తించి వారిని కూడా విధుల నుంచి తొలగించినట్లు ప్రకటించారు.

**పోలీసులకు అప్పగింత:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఓ దళారి భక్తులను మోసం చేయటం గమించిచన ఇఓ ఆతనిపై కేసు నమోదు చేయుటకు పోలీసులకు ఫిర్యాదు చేసారు. సోమవారం రద్దీ గా ఉన్న సమయంలో దేవస్తానంలో విజిలెన్స్ సిబ్బంది సంజయ్ సాహో అనే దళారిని అదుపులో తీసుకున్నారు. ఆలయ ఇఓ వెంకటేశులు ఫిర్యాదు మేరకు ఆతనిని పోలీసులకు అప్పగించినట్లు ప్రకటించారు.

# పీ4 కార్యక్రమంతో పేదరిక నిర్మూలన

- కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, మార్చి 30 ప్రభాతవార్త:

పి4 కార్యక్రమంలో పేదరిక నిర్మూలనకు సమాజ భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో సోమవారం పి4 కార్యక్రమం ప్రారంభమై ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పి4 కార్యక్రమం ప్రధాన ఉద్దేశం సమాజంలో పేదరికంను తగ్గించడం, అవసరమైన కుటుంబాలకు సహాయం అందించడం, సామాజిక భాగస్వామ్యంను పెంపొందించడం అన్నారు. ప్రభుత్వానికి పరిమితులు వున్నప్పటికీ ఈ కార్యక్రమంలో సమాజంలోని ప్రతి ఒక్క వ్యక్తి భాగస్వామం కీలకం అన్నారు. జిల్లాలో నిర్వహించిన సర్వే మేరకు 10 నుండి 12 శాతం కుటుంబాలు వివిధ సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఉపాధి లోపం, ఆరోగ్య సమస్యలు, విద్యాహీనత ప్రధాన సమస్యలుగా వున్నాయన్నారు. ఈ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంధ సంస్థలు, పారిశ్రామికవేత్తల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సేవాభావం కలిగిన వ్యక్తులు కలిసి పని చేయాల్సిన అవసరం వుందన్నారు. ప్రతి పది మందిలో కనీసం ఒకరు సేవాభావంతో ముందుకు రావాలని, అలాంటి వ్యక్తులను ప్రోత్సహించాలన్నారు. పి4 కార్యక్రమం ద్వారా సామాన్యులు సైతం ఇతరులను దత్తత తీసుకుని వారికి విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి రంగాల్లో సహాయం చేసే అవకాశం కల్పించబడిందన్నారు. జిల్లాలోని ఉద్యోగులు, సంఘాలు, వనరులు కలిగిన వారు కనీసం 50 నుండి 200 కుటుంబాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్ళాలని పిలుపునిచ్చారు. చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్నా, బంగారు కుటుంబాల మార్గదర్శకులు, మెగా ఇంజనీరింగ్ సంస్థ ప్రతినిధి శివకృష్ణ, టివిఎస్ కంపెనీ ప్రతినిధి శ్రావణి, ఎన్‌ఆర్‌ఐ సంస్థ ప్రతినిధి మధు, జిల్లాలోని అన్ని శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## దళితుల భూములు స్వాధీనం చేసుకోరాదని వినతి

కుప్పం మార్చి 30 ప్రభాతవార్త

రామకుప్పం మండలం గడ్డురు గ్రామంలో దళితుల అనుభవంలో ఉన్న డికెటి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం దళిత నేతలు, గ్రామస్తులు ఆర్డీవో విజయలక్ష్మి కి వినతి పత్రం అందజేశారు. దళిత రైతులు సాగు చేసుకుంటున్న డికెటి భూములను పవర్ గేట్స్ ప్లాంటేషన్ ప్రాజెక్టు పేరిట స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ భూములపై ఆధారపడి కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. మామిడి ,కొబ్బరి, అరటి, టేకు తదితర చెట్లు ఉండడంతో పాటు పంటల సైతం సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈ భూములను కోల్పోతే దళితుల కుటుంబాలు రోడ్లపై పడతాయని పేర్కొన్నారు. న్యాయం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నేతలు వెంకటేష్, ప్రకాష్, గోవింద,జయప్ప, రాము ఉదయ్ కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

కాణిపాకం, మార్చి 30 ప్రభాతవార్త:



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే ఆయనకు శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలనుఅందజేశారు.ఈకార్యక్రమంలటెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పీ4 అమలుపై అరగొండ సింగిల్‌విండో ఛైర్మన్‌కు ప్రశంసాపత్రం

తవణంపల్లె, మార్చి 30 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం పేదరికలేని సమాజం కోసం అమలు చేస్తున్న పీ4 ప్రజలు- ప్రభుత్వం- ప్రయివేటు కార్యక్రమంలో భాగంగా పూతలపట్టు నియోజకవర్గంలో బంగారు కుటుంబాలకు అందించిన సేవలను గుర్తించి అరగొండ సింగిల్ విండో ఛైర్మన్ ఎ.రంజిత్‌రెడ్డికి సోమవారం పూతల పట్టులో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. మండలంలోని అరగొండ గ్రామ పంచాయతీ పరిధిలో సింగిల్‌విండో ఛైర్మన్ రంజిత్‌రెడ్డి, తన సొంత నిధులతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈమేరకు గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు అరగొండ వద్ద బహుదానది వరద ఉధృతికి తెగిపోయి సుమారు 20 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం కలగడంతో వెంటనే తన సొంత నిధులతో కాజ్‌వేను మరమ్మత్తులు చేసి రాకపోకలను సునరుద్దరించారు. అలాగే పంచాయతీ పరిధిలోని నల్లపరెడ్డిపల్లె గ్రామంలో రక్షిత నీటి సరఫరా పథకంకు స్టార్టర్ షెడ్‌ను తన సొంత నిధులతో నిర్మించారు. దీనితో పాటు పలు కార్యక్రమాలను అమలు చేయడంతో ఈ ప్రశంసాపత్రంను ఎమ్మెల్యే మురళీ మోహన్ చేతుల మీదుగా అందజేసి సత్కరించారు.ఈప్రశంసా పత్రం తనపై మరింత బాధ్యత పెంచిందని రంజిత్‌రెడ్డి తెలిపారు.

## కూలడానికి సిద్ధంగా ఉన్న కరెంటు స్తంభం

బైరెడ్డిపల్లి, మార్చి 30 ప్రభాతవార్త

బైరెడ్డిపల్లి మండలంలోని అనేక పంచాయతీ కేంద్రాలలో కరెంటు స్తంభాలు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నవి ఇదే క్రమంలో మండల కేంద్రంలోని ఎం ఆర్ ఓ ఆఫీస్ సమీపంలో కరెంటు స్తంభము కూలడానికి సిద్ధంగా ఉన్నది. అటుగా వెళ్లే పాదచారులు ఈ దృశ్యాన్ని చూసి భయాన్ని వ్యక్తం చేస్తున్నారు.కరెంటు తీగల సహాయంతో మాత్రమే నిల్చుకొని ఉన్న ఈ స్తంభం ఎప్పుడు పడిపోతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కరెంటు తీగలు చెట్ల మధ్యలో వెళ్లి కరెంటు పాస్ అయ్యే ప్రమాదం ఉన్నదని, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న దీనిపై చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వారు తెలియజేస్తున్నారు.

## సొసైటీ భవనాలను కూల్చిన అక్రమార్కులపై చర్యలు

చిత్తూరుహెల్త్, మార్చి 30 ప్రభాతవార్త:



చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రక్కన వున్న రూ.130 కోట్ల విలువైన థియోసాఫికల్ సొసై టీ పురాతన భవనాలను కూల్చివేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు టిక్కిరా యల్ సోమవారం కలెక్ట రేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరైన నగర కాంగ్రెస్ అధ్యక్షులు టిక్కి రాయల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి మాట్లాడుతూ స్వతంత్ర్య సమరం జరిగిన సమయంలో ఈ సొసైటీ భవనాల్లోకి మహాత్మాగాంధీ వచ్చి బస చేశారని, ఇలాంటి పురాతన, చారిత్రాత్మకమైన భవనంను అక్రమంగా ఎలా కూల్చుతారని ఆయన ప్రశ్నించారు. ఈ సొసైటీ స్థలంలో వాణిజ్య సముదాయాలు నిర్మించాలని పక్కాగా ప్లాన్ చేసిన కొంతమంది ఈ మేరకు భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి పురాతన భవనం కూల్చివేసినా మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదన్నారు. పురాతన భవనం కూల్చివేతపై విచారణ నిర్వహించి కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.

## పదవీకాలం ముగియనున్న సర్పంచులకు సన్మానం

చిత్తూరురూరల్, మార్చి 30 ప్రభాతవార్త:



చిత్తూరుపట్టణం, లక్ష్మీనగర్ కాలనీ, ఎమ్మెల్యే కార్యాలయం నందుగల ప్రజాదర్బార్‌లో ఏప్రిల్ 2వ తేదితో పదవీకాలం ముగియనున్న రూరల్ మండలానికి చెందిన కూటమిపార్టీల సర్పంచులను సోమవారం ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఘనంగా సత్కరించారు. తమ గ్రామాల అభివృద్ధికి, సాధారణ ఎన్నికల్లో కూటమి విజయానికి అందించిన సేవలను ప్రశంసిస్తూ సిద్దంపల్లి సర్పంచ్ విజయేంద్రబాబు, అనంతపురం సర్పంచు శ్యామ్, చింతలగుంట సర్పంచ్ కేశవులునాయుడు, తొప్పాతిపల్లి సర్పంచ్ మునిరత్నం, అనగల్లు సర్పంచ్ ప్రవీణలతో పాటు మండలానికి చెందిన సీనియర్ నాయకులు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రఘు, నాయకులు శశికర్‌బాలు తదితరులను ఘనంగా సన్మాశం చేసారు. శాలువాలు కప్పి సత్కరించారు.

## రూ.44.21లక్షల సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చిత్తూరురూరల్, మార్చి 30 ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎంతో మంది పేదలకు ఆర్థికభరోసా అందుతోందని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. సోమవారం చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయం ప్రజా దర్బార్‌లో అసెంబ్లీ నియోజకవర్గపరిధిలో వివిధ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్సపొంది ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకొన్న చిత్తూరు రూరల్‌మండలం, గుడిపాల మండల లబ్దిదారులకు మొత్తం 52మందికి రూ. 44.21లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షులు జగదీశ్వరనాయుడు, మాజీ మేయర్ అముద, మాజీ డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, గుడిపాల ఎంపిపి గోళ్ల హరిప్రసాద్, సురేంద్రకుమార్, వెంకటేష్‌యాదవ్, నగర కమిటీ సభ్యులు,క్లస్టర్, డివిజన్, బూత్ ఇన్‌ఛార్జీలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయానికి రూ.40 లక్షలతో ప్రహరీ నిర్మాణం

కుప్పం మార్చి 30 ప్రభాతవార్త.



కుప్పం మున్సిపల్ కార్యాలయం వద్ద నూతనంగా 40 లక్షల రూపాయలతో ప్రహరీ గోడ నిర్మాణానికి సోమవారం ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టిసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ ,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు జిమ్దాము ,సురేష్, ఎం ఆర్ సురేష్, కడా సభ్యురాలు సుగుణమ్మ పాల్గొన్నారు .

## పేదలకు సొంతింటి కల ప్రభుత్వ లక్ష్యం

శాంతిపురం , మార్చి 30 ప్రభాతవార్త



రాష్ట్రంలో ఉన్న పేదలకు సొంతింటి కల నిజం చేయాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం ,పి కే యం యుడా ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు పేర్కొన్నారు. సోమవారం 2.5 లక్షల గృహప్రవేశాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాల్ల బూదుగూరు గ్రామంలో గౌరమ్మ గంగులప్ప దంపతులు నిర్మించుకున్న నూతన గృహానికి సంబంధించి తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం పక్కా ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో సెంటు స్థలం కేటాయించి ఎందుకు పనికి రాకుండా పోయిందని చాలా వరకు ప్రజలు గృహ నిర్మాణాలు చేసుకోలేదని పేర్కొన్నారు.కార్యక్రమంలో టీటీడీ డైరెక్టర్ వైద్యం శాంతారాం ,మండల టిడిపి అధ్యక్షుడు ఉదయ్ కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథ నాయుడు, నేతలు మణి,చంద్ర,గిరి, రెస్కో డైరెక్టర్ బసవరాజు స్థానిక నేతలు పాల్గొన్నారు.

# బంగారు కుటుంబాల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు కృషి

## ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం మార్చి 30 ప్రభాతవార్త.



పి4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారని ప్రభుత్వ విప్, కడాపిఎ సి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కడ కార్యాలయంలో పి4 కార్యక్రమం మొదటి వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదరికంలో ఉన్న కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించి వారికి ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కుప్పంలో సైతం బంగారు కుటుంబాలను అదానీ, టి వి ఎస్ ,మెఘాఇంజనీరింగ్ కంపెనీ తదితర సంస్థలు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని తమ వంతు ఆర్థిక సహకారం అందిస్తున్నాయని తెలిపారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు దత్తత తీసుకున్న బంగారు కుటుంబాల కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మరమ్మత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పీకే ఎమ్ ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ ,ఏరియా ఆసుపత్రి వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, కడా సభ్యులు , టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## గ్రామాల సర్వతోముఖాభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయం

-పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



తవణంపల్లె, మార్చి 30 ప్రభాతవార్త:

గ్రామాల సర్వతోముఖాభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డితో కలసి ప్రారంభోత్సవాలు, భూమిపూజలు చేశారు. ఈమేరకు మండలంలోని మత్యం గ్రామపంచాయతీ జోగిండ్ల గ్రామంలో 18 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనం,రెండు లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం,ఎగువమత్యం ఎస్సీవాడలో ఐదు లక్షలతో నిర్మించిన మురుగునీటి కాలువను, మత్యం స్వర్ణ గ్రామ భవనంను ఎమ్మెల్యే మురళీమోహన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు షణ్ముగరెడ్డిలు ప్రారంభోత్సవం చేశారు. అలాగే అరగొండ-బంగారుపాళ్యం రోడ్డు తుంబకుప్పం క్రాస్ నుండి జోగిండ్ల వరకు సుమారు 25 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల సర్వతోముఖాభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ వెంకటేశ్వర చౌదరి, బంగారు పాళ్యం ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, అరగొండ, తవణంపల్లె సింగిల్ విండో ఛైర్మన్ ఎ.రంజిత్‌రెడ్డి, అమరేంద్రనాయుడు, తహశీల్దార్ మాధవరాజు, ఎంపీడీఓ హరప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ రాజశేఖర్, ఐరాల సీడీపీఓ నిర్మల, టీడీపీ నాయకులు దిలీప్‌నాయుడు, తులసియాదవ్, శ్రీధర్‌నాయుడు, భాస్కర్, రఘుపతిలతో పాటు పలువురు నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులకు హాజరైన క్లస్టర్ కోక్లస్టర్ ఇన్‌ఛార్జులు

కుప్పం, మార్చి 30 ప్రభాతవార్త

రాజధాని అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ క్లస్టర్, కో క్లస్టర్ ఇన్చార్జుల శిక్షణ తరగతులకు కుప్పం నియోజకవర్గం నుంచి క్లస్టర్ ఇన్‌ఛార్జులు, కోక్లస్టర్ ఇన్చార్జిలు హాజరయ్యారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్ ఛార్జ్ లు కన్నన్, శ్రీనివాసులు, సోమశేఖర్, కో క్లస్టర్ ఇన్చార్జులు తిరుమ గల్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## కొట్టాలూరులో టిడిపి నేతలచే క్రికెట్ టోర్నీ

కుప్పం, మార్చి 30 ప్రభాతవార్త.



మండలంలోని కొట్టాలూరు గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని పెద్ద ఎత్తున క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ రాజేంద్రన్, కుప్పం రూరల్ ఐటిడిపి అధ్యక్షుడు గుణశేఖర్ యూనిట్ ఇన్చార్జ్ సంజీవరాజు, కో యూనిట్ ఇన్చార్జ్ కార్తీక్, పార్టీ అధ్యక్షులు పొన్ను వేలు క్లస్టర్ ఇంచార్జ్ చంద్రశేఖర్, బూత్ ఇన్ ఛార్జ్ లు పాల్గొన్నారు.

## రాజు కాల్వ పనులు వేగవంతం చేయాలి

కుప్పం, మార్చి 30 ప్రభాతవార్త



స్థానిక 19వ వార్డులోని రాజు కాలువ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సూచించారు. రాజు కాల్వ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ జిమ్ దాము, కౌన్సిలర్ సోము, మాజీ ఎంపీపీ వెంకటేష్,రెస్కో డైరెక్టర్ ఆర్ముగం ,బాలాజీ, శివకుమార్ చంద్రశేఖర్, రాజా, విజయ్, రాధా, శశి, బుజ్జి, దేవా పాల్గొన్నారు.

ఫోటో రైటప్: రాజు కాల్వ పరిశీలన

## కుప్పం బార్‌అసోసియేషన్ అధ్యక్షుడిగా విఎస్ శ్రీకాంత్

కుప్పం, మార్చి 30 ప్రభాతవార్త.





కుప్పం బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది వి.ఎస్ శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కుప్పం బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా రెండేళ్ల కాలానికి సంబంధించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సిద్ధవటం నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఉదయ్ కుమార్, జాయింట్ సెక్రటరీగా వాసు, కోశాధికారిగా పుష్పలత, జాయింట్ కోశాధికారిగా వివేక్, లైబ్రరీ కార్యదర్శిగా ధన శేఖర్ ,జాయింట్ లైబ్రరీ కార్యదర్శిగా పళని, క్రీడల కార్యదర్శిగా అనిల్ కుమార్, క్రీడల జాయింట్ కార్యదర్శిగా జలపతి ,మహిళా కార్యదర్శిగా శైల శ్రీ ,మహిళా జాయింట్ సెక్రటరీగా చందన ప్రియ లను ఎన్నుకున్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం...

ఏఎంసీ ఛైర్మన్ జిఎం రాజు




గుడుపల్లి, మార్చి 30 ప్రభాతవార్త.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సోడి గాని పల్లి పంచాయతీ మల్లేపల్లి గ్రామంలో ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీతో అందిస్తున్న చాప్ కట్టర్ ల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని పేర్కొన్నారు. కుప్పం ప్రాంతంలో రైతులకు సాగునీరు అందించేందుకు హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణాజిల్లాలను తీసుకువచ్చి చెరువులు నింపుతున్నారన్నారు. అలాగే రైతులు సాగు చేస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా తాము సీఎం ఆదేశాలతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పంటల సాగుపై మక్కువ చూపాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ బాబు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## మిస్ అయితే మళ్లీ ఛాన్స్ లేదు...నేటితో దరఖాస్తుల ముగింపు

**తిరుపతి విద్య, మార్చి 30 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఏపీఆర్ జేసీ పరీక్ష దరఖాస్తుల గడువు నేటితో ముగియనుండటంతో విద్యార్థుల్లో ఆందోళన, తొందరపాటు వాతావరణం నెలకొంది. ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు చివరి నిమిషంలో ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం పరుగులు పెడుతున్నారు.ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ పరీక్ష కీలకంగా ఉండటంతో విద్యార్థులు అవకాశాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతో చివరి రోజు దరఖాస్తులకు భారీగా స్పందన కనిపిస్తోంది. అధికారులు సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా వెంటనే దరఖాస్తు పూర్తి చేయాలని సూచిస్తున్నారు.వచ్చే నెల 15న హాల్ టికెట్లు విడుదల చేసి, అదే నెల 24న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇదే సమయంలో, ఏపీ పాలిసెట్2026 దరఖాస్తుల గడువు కూడా వచ్చే నెల 4తో ముగియనున్న నేపథ్యంలో, విద్యార్థులు తమ భవిష్యత్తుకు కీలకమైన ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## జాతీయ వేదికపై మెరవనున్న ఎమరాల్డ్స్ విద్యార్థి

**తిరుపతి విద్య, మార్చి 30 ప్రభాతవార్త**



విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోటీలలో తిరుపతి ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి యోగ విజ్ఞరా జ్ విశేష ప్రతిభ కనబరిచి తృతీ య స్థానం సాధించాడు. ఈ విజయంతో దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందడం ద్వారా కళాశాలకు మరొక గౌరవాన్ని తీసుకొచ్చాడు.విద్యార్థి సాధించిన ఈ విజయంపై ఎమరాల్డ్స్ విద్యా సంస్థల సంచాలకులు గిరిధర్, విశ్వనాథ్ హర్షం వ్యక్తం చేశారు. తమ సంస్థలో విద్యార్థులు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, వేదికలపై ప్రసంగ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటూ ప్రతిభ చాటుతున్నారని పేర్కొన్నారు. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ వంటి ప్రతిష్ఠాత్మక వేదికల్లో తమ విద్యార్థి రాష్ట్ర స్థాయిలో మెరిసి జాతీయ స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని తెలిపారు.ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపకులు, మార్గదర్శకుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే విద్యార్థిని ప్రశంసిస్తూ, జాతీయ స్థాయి పోటీలలో కూడా ఇదే పట్టుదల, ఆత్మవిశ్వాసంతో పాల్గొని మరింత ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షి ంచారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధిస్తూ సంస్థకు మరింత కీర్తి తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఉప సంచాలకులు మునిరత్నం, ప్రిన్సిపాల్ జాఫర్ వల్లి, అధ్యాపకులు భానుకిరణ్ పాల్గొ న్నారు.

## ఉద్యోగుల్లో నైపుణ్యాల పెంపే లక్ష్యం...

### కర్మయోగి శిక్షణ విజయవంతం

**తిరుపతి విద్య, మార్చి 30 ప్రభాతవాం**



జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఉద్యోగులు, అధ్యాపకుల్లో నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన రాష్ట్రీయ కర్మయోగి శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తైంది. మార్చి 23 నుంచి 30 వరకు వారం రోజులపాటు సాగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయానికి చెందిన సిబ్బంది చురుకుగా పాల్గొని వివిధ నైపుణ్యాలను అభ్యసించారు.భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగుల్లో బాధ్యతా భావం, సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంపై ప్రధానంగా దృష్టి సారించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగింది.శిక్షణలో భాగంగా సమయపాలన, కార్యనిర్వహణ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, సమర్థవంతమైన కమ్యూనికేషన్ వంటి అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఉద్యోగులు తమ రోజువారీ విధుల్లో మరింత సమర్థతతో పని చేయడానికి ఈ శిక్షణ ఉపయుక్తంగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ అడిషనల్ డైరెక్టర్ డా. ఎ. చారుకేష్ కోఆర్డినేటర్‌గా, యోగ విభాగం అధ్యాపకులు డా. ఆర్. లక్ష్మీనారాయణ అదనపు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. వివిధ విభాగాల అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొని శిక్షణను పొందారు.

## శ్రీవారి సేవలో ఎమ్మెల్యే మురళీమోహన్



**తిరుమల,మార్చి 30(ప్రభాతవార్త)ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ దర్శించుకున్నారు. ఆయన వీఐపీ బ్రేక్ ఆలయంలోనికి చేరుకుని స్వామివారి ఆశీస్సులందుకున్నారు. ప్రజలందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

## సమన్వయంతోనే ఆహార శుద్ధి రంగ అభివృద్ధి

**పూతలపట్టు, మార్చి 30, ప్రభాతవార్త**



ఆహార శుద్ధి రంగ అభివృద్ధికి సమన్వయం అత్యంత అవసరమని చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఫుడ్ ప్రాసెసర్ అసోసియేషన్ సౌత్ జోన్ చైర్మన్‌గా రెండోసారి ఎన్నికైన కట్టమంచి బాబీని సత్కరించారు. పరిశ్రమలు రైతులు మధ్య పటిష్టమైన సమన్వయం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మాజీ జెడ్పిటిసి తలపలపల్లి బాబురెడ్డి, శివకుమార్, గొడుగుచింత శివారెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని మృతి

**వి.కోట, మార్చి 30 ప్రభాతవార్త:**

మండలంలోని ఆళ్లవారిపల్లి గ్రామంలో ఓ వ్యక్తి చనిపోయాడు. ఓ ఇంటి మేడ పైన గుర్తు తెలియని వ్యక్తి ఉరికి వేలాడుతుండటాన్ని గ్రామస్తులు సోమవారం గుర్తించారు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.మృతుని వయసు 40 సంవత్సరాల నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. అతని ఆచూకీ తెలిసినవారు తమను సంప్రదించాలని వి.కోట పోలీసులు తెలిపారు.

## వేలంపాటలో 10.39 లక్షలు పంచాయతీకి ఆదాయం

**రామకుప్పం,మార్చి30 ప్రభాతవార్త**



రామకుప్పం మేజర్ పంచాయతీ వేలం పాటలో 10.లక్షల 39 వేల 8 వందలు రూపాయలు పంచాయతీకి ఆదాయం లభించింది. సోమవారం పంచాయితీ కార్యాలయంలో దినసరి మార్కెట్, వారపు సంత, ప్రైవేట్ వాహనాలు, పంచాయతీ గదులకు 202627 ఆర్థిక సంవత్సరానికి వేలంపాట అధికారులు గుత్తేదారులతో నిర్వహించారు. 202526 గత సంవత్సరం 7 లక్షల 72 వేలు ఆదాయం రాగ 2026 27 ఆర్థిక సంవత్సరానికి 10 లక్షల 39వేల ఎనిమిది వందల రూపాయలు పంచాయతీకి ఆదాయం సమకూరింది. వారపు సంత,దినసరి మార్కెట్ వెంకటేష్ , ప్రైవేటు వాహనాలు అజీజ్ భాష, అంగడి గదులు ఆంజనేయులు, శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి వేలం పాటలో కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆంజనేయ రెడ్డి, సర్పంచ్ మురళీకృష్ణ, నేతలు సీతాపతి, గంట్ల రెడ్డి, మహమ్మద్ రఫీ, రాజసింహ, ఆంజనేయప్ప, అల్లిశీన, పంచాయతీ ఈవో సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ వేలం ద్వారా రూ.5.73 లక్షలు ఆదాయం

**సత్యవేడు, మార్చి 30 ప్రభాతవార్త:**

ఎట్టకేలకు సత్యవేడు మేజర్ పంచాయతీ పరిధిలో పంచాయతీ గదులు, పూల మార్కెట్, ప్రైవేటు బస్టాండ్లకు సంబంధించివేలం పాటలు సోమవారం ముగిసింది. ఈ వేలం పాటల ద్వారా పంచాయతీకి రూ.5.73 లక్షల వరకు ఆదాయం వచ్చిందని డిప్యూటీఎంపీడీవో షణ్ముగం మీడియాకు వెల్లడించారు. పలుమార్లు వాయిదాలు పడ్డ వేలం పాటలు సోమవారం సందడిగా ముగిసింది. మేజర్ పంచాయతీ సర్పంచ్ మంజుల బెల్ట్ రమేష్, పంచాయతీ కార్యదర్శి ముని రవికుమార్‌ల పర్యవేక్షనలో కొనసాగింది. స్థానిక కోర్టు సమీపంలో ఉన్న పంచాయతీ గదులకు ఒక్కొక్కటికి నెనలకు 600 చొప్పున పెంచి వేలంలో కొందరు దక్కించుకున్నారు. అదే విధంగా మార్కెట్ గదులను కూడా వేలం ద్వారా వ్యాపారస్తులకు దక్కించుకున్నారు. ప్రధానంగా మూడు రోడ్ల కూడలిలోని మహాత్మగాంధీ విగ్రహం సమీపంలో ఉన్న పూల మార్కెట్ గదులను కూడా పాత వ్యాపారస్తులే తగ్గించుకోవడం జరిగింది. ఇక ప్రైవేటు బస్టాండ్ రూ.3.20 లక్షల వేలం ద్వారా ఓ వ్యాపారి దక్కించుకోవడంజరిగింది. ఇదిలా ఉండగా వారపు సంత వేలం పాటలు వాయిదా పడింది.పృథ్వీరాజ్, కోనయ్య, కార్తీక్, చిన్న తదితరులు పాల్గొ న్నారు.

## శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో వైభవంగా ప్రదోష పూజలు

**నాగలాపురం, మార్చి 30 ప్రభాతవార్త:**



నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయచైర్మన్ డి.పద్మనాభరాజు సమక్షంలో ప్రదోష పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ప్రదోషం సందర్భంగా శ్రీ నందీశ్వర స్వామివారికి, శ్రీ వాల్మీకేశ్వర స్వామివారికి ఏకకాలంలో ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామి, అమ్మవార్లను, ప్రదోష నందీశ్వర స్వామివారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు, మహాదీపారాధనలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు ప్రసాదం వినియోగం కొరకు నింద్రకు చెందిన శ్రీనివాస్ మిల్క్ ప్రైవేటు లిమిటెడ్ వారు ఉభయదారులుగా వ్యవహరించారు. పాలక మండలి సభ్యులు పి.హంసరుద్రయ్య, ఎస్.కృష్ణయ్య, డి.నాగభూషణమ్మ, మస్తాన్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## పేదరికాన్ని తగ్గిడమే లక్ష్యంగా పి4

### ఆర్‌డిఓ రామ్మోహన్

**చంద్రగిరి, మార్చి 30 ప్రభాతవార్త:**



వినూత్న విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2029 నాటికి పేదరిక నిర్మూలన లక్ష్యంగా పి4 ప్రవేశపెట్టి ఏడాది పూర్తి చేసుకున్నట్లు చంద్రగిరి నియోజకవర్గ ప్రత్యేక అధికారి రామ్మోహన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పి4 మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపన్న పౌరులను నిరుపేద కుటుంబాలతో అనుసంధానించడం ద్వారా పేదరిక నిర్మూలన సాధించడంతో పాటు సామాజిక అభివృద్ధిని ప్రోత ్సహించడమే లక్ష్యమని అన్నారు. ప్రజలు-ప్రభుత్వం-ప్రైవేటు భాగస్వామ్యంతో 2025-26 సంవత్సరంలో పి4 ద్వారా నియోజకవర్గంలో ఇప్పటి వరకు దత్తత తీసుకోబడిన బంగారు కుటుంబాలకు ప్రభుత్వం మధ్యవర్తిగా వ్యవహరిస్తుందన్నారు. మరిన్ని కుటుంబాలను దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పి4 విధానం అమలులో ఎంఎల్ఏ పులివర్తి నాని పనితీరును ముఖ్యమంత్రి అభినందించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఉత్తమ మార్గదర్శకులైన హిమశేఖర్, గౌతమ్ ఆనంద్‌లను ఆయన సన్మానించి, ప్రశంసాపత్రం అందజేశారు. కాగా పి4పై ముఖ్యమంత్రి నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో అధికారులకు, టీమ్ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపిడిఓ అమర్‌నాధ్ రెడ్డి, యంగ్ ప్రొఫెషనల్ నవీన్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## మామిడి పూత సమయంలో చీడపీడల నివారణ

### రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

**చంద్రగిరి, మార్చి 30 ప్రభాతవార్త:**



ఆలస్యంగా వచ్చిన మామిడి పూతకు పగటిపూట అధిక ఉష్ణోగ్రత, రాత్రి చల్లటి ఉష్ణోగ్రతలతో పురుగు, తెగుళ్ళు, చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అన్నారు. మండల పరిధిలోని భీమవరం, పనపాకం పంచాయతీ అరిగెలవారిపల్లి, చంద్రగిరిలో మామిడి తోటలను శాస్త్రేత్తలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. జనవరి-ఫిబ్రవరి రెండవ వారంలోపు వచ్చిన మామిడి పూత పిందెకట్టి సుమారు 150-200 గ్రాముల బరువు దశలో వున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి రెండవ వారంలో వచ్చిన పూతకు చీడపీడ ఏర్పడినందున సాధారణంగా ఉపయోగించే మందులకు అధనంగా రెండు రకాలు సస్యరక్షణ మందులు వినియోగించాల్సి వుంటుందన్నారు. పిందెలు రాలిపోకుండా నీటితడి, 150 గ్రాముల కాయదశలో ఫ్రూట్ కవర్స్ తొడగటం వంటి పలు సూచనలు మామిడి పిందెలు ఏఏ దశల్లో ఎటువంటి మందులు ఏ మేరకు వినియోగించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు సుధాకర్, అనిల్‌కుమార్, రాస్ సిబ్బంది సాయి చంద్రబాబు, కిషోర్, నీరజ్, రైతు పానేటి చెంగల్రాయులు, పాల్గొన్నారు.

## నేటి నుండి శ్రీశక్తి పీఠంలో బ్రహ్మోత్సవ కుంభాభిషేకం

### పీఠం ఏఓ శ్రీకాంత్

**రామచంద్రాపురం, మార్చి 30 ప్రభాతవార్త:**



రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠం లో మంగళవారం నుండి పీఠం మహా బ్రహ్మోత్సవ కుంభాభిషేకం ప్రారంభ మవుతాయని పీఠం ఏఓ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం శ్రీశక్తి పీఠంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగద్గురువు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరనంద మహాభారతి స్వామి స్థాపించిన శ్రీశక్తి పీఠం 6 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 7 రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవ కుంభాభిషేకానికి మంత్ర మహేశ్వరి రమ్యానంద భారతి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని అన్నారు. స్త్రీశక్తికి నిదర్శనంగా హిందూ మహిళలకు ప్రత్యేక శక్తి అవార్డులను ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1న ప్రముఖ యాంకర్ సుమ కనకాలకు శక్తి అవార్డు అందజేయడం జరుగుతుందన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని పీఠంలో సహస్ర సువాసినీ పూజ, నవగ్రహ పూజ, శాంతి హోమం జరిపించనున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి మరకతశక్తి కాళీదేవికి అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని గురూజీ, మాతాజీ ఆశీస్సులను పొందాలని కోరారు. నిత్యం పీఠానికి వచ్చే భక్తులకు నిత్య అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.పీఠం కార్యదర్శి చంద్రశేఖర్, మేనేజర్ ప్రసాద్, కోఆర్డినేటర్ సుధామయి, పూజారి మనవాలన్, తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ విద్యాసంస్థల్లో ఆధునిక బోధనకు శ్రీకారం

**తిరుపతి విద్య మార్చి 30 ప్రభాతవార్త**



టీటీడీ ఆధ్వర్యంలోని విద్యాసంస్థల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి అత్యాధునిక బోధన విధానాలను ప్రవేశపెట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జేఈఓ డాక్టర్ శరత్ తెలిపారు. సోమవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాలను అధికారులు, అధ్యాపకులతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీటీడీ విద్యాసంస్థల్లో ఆధునిక వసతులు కల్పిస్తూ బోధన విధానాలను మెరుగుపరచడమే లక్ష ్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచే విధంగా కోర్సులను రూపకల్పన చేయడంపై కూడా దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ఇప్పటికే రూ.118 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు.కళాశాలల్లో డిజిటల్ తరగతులు ఏర్పాటు, పరీక్షల సమయంలో ప్రత్యేక శిక్షణ, విద్యార్థుల భద్రత, మెరుగైన వసతి, పోషకాహారం, పోటీ పరీక్షలకు కోచింగ్, వైద్య సదుపాయాల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు.అనంతరం కళాశాలలో జరుగుతున్న ప్రత్యేక తరగతులను జేఈఓ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిషన్, కామర్స్ శాఖాధిపతి డాక్టర్ మల్లికార్జున,తెలుగు శాఖాధిపతి డాక్టర్ భీమన్న, వార్డన్ లోకనాథం, డిప్యూటీ వార్డెన్ వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రతి దళిత గిరిజనులకు ఇంటి పట్టాలు మంజూరు చేయండి

### - వంటావార్పు కార్యక్రమంలో సీపీఎం

**సత్యవేడు, మార్చి 30 ప్రభాతవార్త:**



ప్రతి దళిత గిరిజనులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని వంటావార్పు కార్యక్రమం సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. సత్యవేడు మండలం పేరడం, మదనంబేడు, అంబాకం గ్రామాల్లోని గిరిజన, దళితుల అనుభవంలో ఉన్న భూములకు, ఇళ్ళ స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామస్తులతో కలసి సీపీఎం పార్టీ వంటావార్పు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ సత్యవేడు మండలంలో అంబాకం, పేరడం, మదనంబేడు గ్రామాల్లో గిరిజనులు దళితులు ఇంటి స్థలాలు లేవని ప్రభుత్వ భూమిలో ఇల్లు వేసుకుని గత నాలుగు సంవత్సరాల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కూడా పరిష్కారం కావడం లేదని విమర్శించారు. ఇంటి పట్టాల కోసం సాగు భూమి పట్టాల కోసం అనేక పర్యాయాలుగా పాదయాత్ర ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ రెవెన్యూ అధికారుల్లో చలనం లేదని తెలిపారు. కార్పొరేట్ కంపెనీలకు, గ్రావెల్ క్వారీలకు అనుమతులు ఇవ్వడంలో మాత్రం ఆగమేఘాలపైన చర్యలు తీసుకుంటారని మండి పడ్డారు. పేద ప్రజల సమస్యలపై స్పందించాలంటే కాలయాపన చేస్తూ రేపు రా..ఎల్లుండు రా... అంటూ కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారని ఆవేదన చెందారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేసినప్పటికీ ఎండోర్స్‌మెంట్ చేతికిచ్చి మీ పని అయిపోయింది అన్నట్టు రెవెన్యూ అధికారులు వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా తహసీల్దార్ స్పందించి తక్షణమే దళిత గిరిజనులకు సాగు భూమి పట్టాలు, ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన తహసీల్దార్ రాజశేఖర్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో మేత బీడు భూమిగా ఉన్నందున సత్వరం పట్టాలు ఇవ్వలేకపోయామని, వెంటనే రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా మార్పు చేసి సాగుభూమి పట్టాలు ఇంటి పట్టాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. కార్యక్రమంలో సీపీఎం సత్యవేడు ప్రాంతీయ కార్యదర్శి వెలుగు రమేష్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణాచలం, యువజనసంఘం నాయకులు మురళి, సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు కృష్ణయ్య, మునస్వామి, ఎల్లయ్య, రాజేంద్ర, మహేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యుద్ధాలు ఆపండి.. మానవ ప్రాణాలు కాపాడండి

**కేవీబీ పురం, మార్చి 30 ప్రభాతవార్త:**



ఒకరి ప్రాణాలు మరొకరు బలిగొనడం అనాగరిక చర్య అని సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధంలకు వ్యతిరేకంగా కేవీబీ పురం మండలం కళత్తూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ యుద్ధ ఉన్మాదంతో మనుషుల ప్రాణాలు బలుకొనడమే కాక ఆస్తులు ధ్వంసం చేస్తూ ప్రాణాల కూడా హరించే వేస్తూ అశాంతికి నిలయంగా అమెరికా ఇజ్రాయిల్ దేశాల వ్యవహరిస్తున్నాయని మండి పడ్డారు. వారు చేస్తున్న యుద్ధాల వల్ల ప్రపంచ దేశాలలో ఆర్థిక సంక్షోభాలు తలెత్తడమేకాక నిత్యావసర ధరలు, గ్యాస్, పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అందుతున్నాయని ఆవేదన చెందారు. మన దేశంలో రైతు ఉత్పత్తులను కూడా ఎగుమతి చేసుకోలేని పరిస్థితికి కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నానమ్మ, వెంకట మ్మ, రోజా, లక్ష్మి, పద్మలత, గౌరి తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలను ఆదుకోవడం వైసీపీ లక్ష్యం

**పుత్తూరు రూరల్, మార్చి 30 ప్రభాతవార్త:**

పుత్తూరు మండలం తడుకు పంచాయతీ మజ్జిగగుంట ఎస్టీ కాలనీకి చెందిన శివ కుటుంబానికి సహాయం, చిన్నారి గౌతమ్‌కుమార్‌కు గత వారంలో ఊపిరి తిత్తుల వ్యాధితో ఉన్న కుటుంబానికి మాజీమంత్రి రోజా సహాయంతో ఆపరేషన్ విజయవంతమైఇంటికి చేరుకున్న తరువాత ఆకుటుంబానికి ఉచితంగా నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. పేద కుటుంబాలను అన్ని విధాల సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో కష్టాల్లో ఉన్న పేదలను తనదైన శైలిలో ఆదుకోవడం ఒక్క రోజాకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఇరువరం చిరంజీవి, రాష్ట్ర కార్యదర్శి ఎస్టీసెల్ అవడి లోకనాథం(కుట్టి), బి.మస్తాన్, వీరస్వామి, కేశవమండడి పాల్గొన్నారు.

## అడహక్ కమిటీ అధ్యక్షుడిగా బాలాజీశర్మ నియామకం

**పుత్తూరు రూరల్, మార్చి 30 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని బెస వీధిలో వెలసిన శ్రీ తరుణ గణపతి ఆలయం సమీపంలో బ్రాహ్మణ బంధువుల ఆత్మీయ సమావేశం అధ్య క్షుడు ఆలూరి రామకృష్ణ ఆధ్వర్యంలో బాలాజీశర్మ స్వగృహంలో నిర్వహించారు. పుత్తూరు శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సం ఘం ఎన్నో సేవా కార్యక్రమా లు చేస్తున్న నేపథ్యంలో బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు, బ్రాహ్మణ పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వానికి బ్రాహ్మణుల సంక్షేమం కోసం నివేదిక ఇచ్చే విధంగా ప్రస్తుతం ఉన్నటువంటి కమిటీతో పాటు ఈ కమిటీని నియమిస్తూ కమిటీ సభ్యులతో ఏకగ్రీవ నిర్ణయం మేరకు అధ్యక్షుడిగా కె.బాలాజీశర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే వైస్‌చైర్మన్ సాయినాథరావు, సభ్యులు విజయకుమార్, బాలాజీరావు, రాహుల్, పద్మప్రియను ఎన్నుకున్నట్లుపేర్కొన్నారు. నూతనంగా ఎన్నుకోబడినటువంటి అధ్యక్షుడు బాలాజీశర్మకు రాష్ట్ర కార్యదర్శి, జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమితి ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్ అభినందనలు తెలిపారు. సమావేశంలో పుత్తూరు గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## సత్యవేడు కోర్టు బార్ ఎన్నికలు ఏకగ్రీవం



**సత్యవేడు, మార్చి 30 ప్రభాతవార్త:**

సత్యవేడు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. ఎన్నికైన అధ్యక్షుడిగా బి.మహేష్, సెక్రటరీగా బి.రాజా నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. కార్యవర్గ సభ్యులదరికి బార్ మెంబర్ల శుభాకాంక్షలు తెలుపుతూ పదవీ కాలంలో అసోసియేషన్ అభివృద్ధికి న్యాయవాదుల సంక్షేమానికి గొప్ప సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్లు మధు, దినకర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ

### రాష్ట్రకన్వీనర్‌గా ఎస్.ఎం.సురేష్

**నాగలాపురం, మార్చి 30 ప్రభాతవార్త:**



నాగలాపురం మండలం పడమర హరిజనవాడకి చెందిన ఎస్.ఎం.సురేష్‌ని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్రకన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ జాతీయ సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు చంటి ముదిరాజ్ ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథరెడ్డి వెంబకం ఎంపీటీసీ రాజా, ఏకుమలైలు శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజల్లోకి పీ-4 ప్రయోజనాలను తీసుకెళ్లాలి - ఎమ్మెల్యే

**సత్యవేడు, మార్చి 30 ప్రభాతవార్త:**




సత్యవేడు నియోజకవర్గ అభి వృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా సత్య వేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని తరగతి గదులు, రిజిస్టర్లు, మౌలిక సదుపాయాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యాబోధన తీరు తెన్నులు, కళాశాలలో ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం సత్యవేడు ఎంపీడీవో కార్యాలయంలో పీ-4 పథకం అమలుపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్‌తో కలసి ఆయన పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశ్యారు. సమాజంలో అట్టడుగున ఉన్న పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు సమావేశంలో మండలస్థాయిఅధికారులు,కూటమినాయకులు,కార్యకర్తలుపాల్గొన్నారు

# పేదరిక నిర్మూలన కోసమే పి-ఫోర్ పథకం : ఎమ్మెల్యే



వెంకటగిరి, మార్చి 30 ప్రభాతవార్త: పేదరిక నిర్మూలన కోసమే సీఎం చంద్రబాబు నాయుడు పి ఫోర్ పథకాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. పి ఫోర్ పథకం ప్రవేశపెట్టి సంవత్సరమైన సందర్భంగా వెంకటగిరిలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. పేదల కుటుంబాలను దత్తత తీసుకొని అనేక స్వచ్ఛంద సంస్థల వారు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. తాను కూడా రెండు గ్రామాలు తీసుకొని అభివృద్ధి చేశామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థల వారు ఇంకా ముందుకు వచ్చి పేదలను బంగారు కుటుంబాలుగా తీర్చి దిద్దాలని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని నిర్వీర్యం చేసిందని చెప్పారు. రాష్ట్ర అనే దివాలా చేయించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమ కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి ప్రసాద్ రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో పి4 పథకం విజయవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థల వారు బంగారు కుటుంబం దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళలకు ఉచితంగా 20000 గ్యాస్ కనెక్షన్లను ఇప్పిచ్చామని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు పి 4 పథకం ద్వారా పేదరిక నిర్మూలన చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కమిషనర్ కిరణ్, ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, జనసేన నాయకులు అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్



## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

**- సీఎంను కోరిన ఎమ్మెల్యే కురుగొండ్ల**

వెంకటగిరి, మార్చి 30 ప్రభాతవార్త: సీఎం నారా చంద్రబాబు నాయుడుని నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. నాయుడుపేటకు సీఎం వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే కలిసి నియోజకవర్గ సమస్యలు తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గ ఎంతగానో వెనుకబడిందని నిధులు ఇవ్వాలని కోరారు. గూడూరు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, బొజ్జల సుధీర్ రెడ్డి తదితరులు కలిశారు.

## సీఎంను కలిసిన ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి



వెంకటగిరి, మార్చి 30 ప్రభాతవార్త: సీఎం చంద్రబాబునాయుడు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం చంద్రబాబు నాయుడు శాలువాతో సత్కరించారు. మహిళా యూనివర్సిటీ వద్ద సీఎంతో ఎమ్మెల్సీ స్వాగతం పలికారు.

## శ్రీచెంగాళమ్మ నిత్యాన్నదానానికి విరాళం



సూళ్లూరుపేట, మార్చి 30 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం లక్షా పదివేలు విరాళం అందింది. వెంకటగిరికి చెందిన జొన్నాదుల ధార్విక్ శివాన్ష్ కుటుంబ సభ్యులు రూ.60 వేలు, త్రివేదుల విష్ణు కుటుంబ సభ్యులు రూ.50వేలు నిత్యాన్నదానానికి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి చేతులు మీదుగా అందజేశారు.

## ముఖ్యమంత్రి రాక కోసం పెళ్ళకూరు పసుపు శ్రేణులు



పెళ్లకూరు, మార్చి 30 ప్రభాతవార్త : పేద ప్రజల సొంతింటి కల అయినా టిట్కో గృహాలను లబ్ధిదారులుకు అందజేయడం కోసం సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేటకు విచ్చేసి లబ్ధిదారులకు అందజేసిన అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో ప్రత్యేకంగా ప్రత్యేక సమావేశం ఉంటుందని మండలంలోని తెదేపా కార్యకర్తలు ముఖ్యమంత్రిని స్వయంగా కలిసి తమ సమస్యలను స్వయంగా అధ్యక్షునికి తెలియజేయాలనే ఆత్రుత ముఖ్యమంత్రిని దగ్గర నుంచి చూడాలని ఆనందంతో మండలంలోని పంచాయతీ నుంచి తెదేపా శ్రేణులు ట్రాక్టర్లు ఆటోల ద్వారా ఆనందోత్సవాల మధ్య పసుపు జెండాలు చేపట్టి జై తెలుగుదేశం నినాదాలతో నాయుడుపేటకు బయలుదేరారు.

## వ్యక్తి మృతిపై పోలీసులకు ఫిర్యాదు

వాకాడు, మార్చి 30 ప్రభాతవార్త: వాకాడు మండలం మూల పడవ పంచాయతీ పరిధిలోని నలగామాల గ్రామంలోని కార్కేటి మస్తానయ్య మృతిపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పోలీసు వివరాలు మేరకు గ్రామంలోని కుటుంబ ఇరు వర్గాల మధ్య దాడిలో నెల రోజుల క్రితం ఘర్షణ జరిగాయి, దాడిలో మస్తానయ్య చికిత్స పొందుతూ రెండు రోజులు క్రితం మృతి చెందడంతో గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## దొరవారి సత్రం మండలంలో గ్రావెల్ జాతర

**- పగలు రాత్రి తేడా లేకుండా గ్రావెల్ దందా!**



దొరవారిసత్రం, మార్చి 30 ప్రభాతవార్త : దొరవారిసత్రం మండలం లోని పగలు రాత్రి తేడా లేకుండా మట్టి గ్రావెల్ ప్రక్క మండలాలకు తరలిపోతూనే ఉంది. వెదురుపట్టు గ్రామ సమీపంలో ప్రభుత్వ భూముల్లో నుంచి గ్రావెల్ దందా సాగుతుందని గ్రామం లోని ప్రజలు అధికారులపై ధ్వజమెత్తారు. అంతే కాకుండా ఈ మండలంలో ఎక్కడ చూసినా ఏ చెరువులో చూసిన గ్రావెల్ మట్టి భారీ వాహనాలతో దందా కొనసాగుతుందని దీని ఆపే అధికారం ఎవరికి లేనట్లుగా మండలంలో అధికారులు వ్యవహరిస్తున్నారూ గ్రావెల్ దందా అధికార పార్టీ అండదండలతో కొనసాగుతూనే ఉందని కొందరు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న అధికారులో మాత్రం ఎటువంటి చలనం లేదని కొందరు అధికారులు తీరుపై ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేశారు. చెరువులో గ్రావిల్ కాకుండా భారీ వాహనాలు వలన రోడ్లు కూడా గుంతలుగా మారాయని గ్రావెల్ మట్టి కావాలంటే దొరవారిసత్రం మండలం కేరాఫ్గా మారిందని అధికారులు అండదండలతో ఈ దందా పరంపరం కొనసాగుతూనే ఉందని ప్రజలు అధికారులపై ధ్వజమెత్తారు. ఇకనైనా అధికారులు తీరు మార్చుకోవాలని గ్రామాల్లోని ప్రజలు కోరుకుంటున్నారు.

## పోలేరమ్మ హుండీ లెక్కింపు



వెంకటగిరి, మార్చి 30 ప్రభాతవార్త: గ్రామశక్తి స్వరూపిణి శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం పరకామణి సేవ (హుండి లెక్కింపు) శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు లెక్కించారు. ఈ కార్యక్రమం దేవాదాయ శాఖ అధికారి శ్రీ స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి పి. శ్రీనివాసులు భక్తుల పర్యవేక్షణలో శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి అర్వ భూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. హుండిలు ద్వారా 02.02.2026 నుండి తేదీ 30.03.2026 వరకు అనగా 56 రోజులకు గాను రూ. 7,97,110 నగదు వచ్చింది. యూఎస్ డాలర్, కోవైట్ దినార్1, బంగారం 0.012.700 గ్రాముల, వెండి 0.011.000 గ్రాములు భక్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సిబ్బంది, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగులు, రెవిన్యూ అధికారులు, శ్రీవార్ల సేవా సమితి నెల్లూరు స్వచ్ఛంద సేవకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## సీఎం సభకు తరలివెళ్లిన పండ్లూరు టిడిపి కార్యకర్తలు



నాయుడుపేట మార్చి 30 ప్రభాతవార్త: నాయుడుపేట పట్టణ సమీపంలోని బిరదవాడ వద్ద గల టిడ్కో గృహ సముదాయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చిట్టేటి చెంచయ్య ఆధ్వర్యంలో మండలంలోని పండ్లూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడం కోసం తమ గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలతో సభా ప్రాంగణానికి తరలి వెళ్లినట్లు చిట్టేటి చెంచయ్య తెలియజేశారు.

## సీఎం సభకు తరలి వెళ్లిన కాపులూరు టిడిపి కార్యకర్తలు



నాయుడుపేట మార్చి 30 ప్రభాతవార్త:పట్టణ సమీపంలోని బిరదవాడ వద్ద గల టిడ్కో గృహ సముదాయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు కాపులూరు చక్రపాణి ఆధ్వర్యంలో మండలంలోని కాపులూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు.సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడం కోసం తమ గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలతో సభా ప్రాంగణానికి తరలి వెళ్లినట్లు కాపులురు చక్రపాణి తెలియజేశారు.

# సిఎం వద్దకు చేరిన... గ్రామీణ శాస్త్రవేత్తల పంచాయితీ

**-ఫిర్యాదు చేసిన మాజీ ఎంఎల్ఏ**

**-గ్రామీణ శాస్త్రవేత్తలకు మద్దతు పలికానని నాపై, నా కొడుపై పోలీసులు కేసు**



తొట్టంబేడు,మార్చి 30 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలోని గ్రామీణ శాస్త్రవేత్తలకు మద్దతుగా మాట్లాడినందుకు శ్రీకాళహస్తి పోలీసులు తనపై తన కుమారుడు ఎస్‌సివి దిలీప్‌పై కేసు నమోదు చేసారని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేసారు.ఈ అంశానికి సంబంధించి అక్కడే ఉన్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ముఖ్యమంత్రి ఆదేశాలు జారి చేసినట్లు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. తొట్టంబేడు మండలం కారాకొల్లుకు సంబందించి పట్టాలు లేని శాస్త్రవేత్తలు తయారు చేసిన భూ అమృత్‌కు సంబందించి గత ఏడాదిగా శాస్త్రవేత్తకు హైదరాబాదుకు చెందిన టోకు వ్యాపారి మధ్య వివాదాలు చోటు చేసుకున్నాయి.దాంతో ఇటీవల హైదరాబాది పిర్యాదు అంటూ పోలీసులు ఎస్‌సివి నాయుడుకు సంబంధించి ప్యాక్టరీ ఆవరణలో హల్ చల్ చేసారు. అంతేకాక గ్రామీణ శాస్త్రవేత్తలు తయారు చేసిన భూ అమృత్ బాగా విజయవంతమైంది. యూరియా కన్నా మిన్నగా ఉండటంతో బాగా వ్యాపారం పుంజుకుంది.దాంతో హైదరాబాద్ వ్యాపారికి మనస్సు మారింది. దాంతో ఆతను గ్రామీణ శాస్త్రవేత్తలతో లొల్లికి దిగారు. ఈ వివాదాలు జరుగుతుండగా హైదరాబాది సివిల్‌కోర్టులో దావా వేసి దాని ఆధారంగా పోలీసులను రంగంలోకి దించిన విషయం విదితమే.

**సిఎంకు ఫిర్యాదు:**

శ్రీకాళహస్తిలో జరుగుతున్న సంఘటనలకు సంబంధించి తొట్టంబేడు మండలంలోని కారాకొల్లు గ్రామంలోని ప్రజలు తెలుగుదేశం పార్టీకి పూర్తిగా మద్దతుగా ఉన్నారని అయితే అక్కడ శాస్త్రవేత్తలకు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి మోసం చేస్తే దానిని ప్రశ్నించిన తనపై తన కుమారుడు ఎస్‌సివి దిలీప్‌పై శ్రీకాళహస్తి పోలీసులు తప్పుడు కేసు నమోదు చేసారని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. స్థానికంగా ఉన్న యువకులకు అన్యాయం జరిగితే సమగ్ర వివచారణ జరపాల్సిన పోలీసులు తమపై కేసు నమోదు చేసినట్లు వివరించారు హైదరాబాద్ వ్యాపారి గ్రామీణ శాస్త్రవేత్తల నుంచి సుమారు రూ.5కోట్లు విలువ చేసే సరకును తీసుకొని సొమ్ములు ఎగ్గొట్టి ఫిర్యాదు చేస్తే విచారణ జరపాల్సిన పోలీసులు ఏక పక్షంగా హైదరాబాద్ వ్యాపారి లంచాలకు తలొగ్గి కేసులు నమోదు చేయటంను సిఎంకు ఫిర్యాదు చేయగా ఆయన సీరియస్ అయ్యారు. అక్కడే ఉన్న కలెక్టర్‌ను వెంటనే విచారణ జరపాలని ఆదేశించారు.

**పోలీసుల ఏక పక్ష నిర్ణయం:**

ఈ సందర్భంగా ఎస్‌సివి నాయుడు మాట్లాడుతూ నేడుయువతకు ప్రభుత్వం,యువ నాయకుడు నారాలోకేష్ మద్దతుగా పరిశ్రలతో ఉపాధికి పథకాలు రూపొందిస్తుంటే గ్రామాల్లో ఉన్న యువకులకు కొందరు మోసం చేస్తుంటే పోలీసులు వారికి మద్దతుగా కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. భూ అమృత్ తయారు చేసిన శాస్త్రవేత్త చంద్రశేఖర్‌కు జాతీయ అవార్డు రాష్ట్రపతి అందించారన్నారు. అయితే శ్రీకాళహస్తిలో యువత పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. గ్రామీణ శాస్త్రవేత్తలకు మద్దతుగా నిలిచే వారిపై కేసులు బనాయించటమా? అని ప్రశ్నించారు.కారాకొల్లు శాస్త్రవేత్తలకు న్యాయం కోసం వెనకడుగు వేసే ప్రసక్తి లేదని ఎస్‌సివి స్పష్టం చేసారు.

## సీఎంను కలిసిన జనసేన పార్టీ నేత ఉయ్యాల



నాయుడుపేట, మార్చి 30 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మర్యాద పూర్వకంగా కలిశారు.సోమవారం నాయుడుపేట పట్టణ సమీపంలోని బిరదవాడ వద్ద గల టిట్కో గృహ సముదాయాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడు ను జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసి ఓ పుష్పాన్ని అందజేసి ఘన స్వాగతం పలికారు.

## సీఎంను కలిసిన టిడిపి నేత పోట్లపూడి



నాయుడుపేట, మార్చి 30, ప్రభాతవార్త రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను టిడిపి నేత,ఎస్ జెవెలరీస్ అధినేత పొట్లపూడి రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నాయుడుపేట పట్టణ సమీపంలోని బిరదవాడ వద్ద గల టిట్కో గృహ సముదాయాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడును టిడిపి నేత పొట్లపూడి రాజేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పాన్ని అందజేసి ఘన స్వాగతం పలికారు.

## కూటమి ప్రభుత్వంలో సొంతింటి కల సాకారం

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు (నగరి), మార్చి 30 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వంలో సొంతింటి కల సాకారమవుతోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. సోమవారం నగరి మునిసిపాలిటీ ఒరుగంటా పురంలో జరిగిన నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్దిదారులకు ఇంటి తాళాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన గృహ సముదాయాల్లో రోడ్లు, మంచినీటి వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత కింద 2025 నవంబరు 12వ తేదీన 3,00,192 ఇళ్లను కూటమి ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. రెండో విడతగా ప్రస్తుతం మరో 2,50,893 ఇళ్లను పంపిణీ చేస్తోందని తెలిపారు. 2029 సంవత్సరానికి కల్లా రాష్ట్రంలో అందరికీ సొంతిల్లు వుండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఇళ్ల లబ్దిదారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని ధ్వజస్థంభం ఏర్పాటు



ఏర్పేడు,మార్చి 30 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశు రామేశ్వరుని ధ్వజస్థంబం ప్రతిష్ట కార్యక్రమాలకు భక్తి శ్రద్దలతో సోమవారం నిర్వహించారు.అతి పురాతన మైన ఆలయం కుంబాభిషేకం ఏప్రిల్ 19 నుంచి 23 వరకు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం నుంచి ఆలయ ఆవరణ గుడిమల్లం గ్రామంలో ఆధ్యాత్మిక సందడి చోటు చేసుకుంది. ఆలయం,గ్రామంలో పండగ వాతావరణం చోటు చేసుకుంది.గ్రామంలో మామిడితోరణాలతో ముస్తాబు చేసారు.ఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు,ఇఓ రామచంద్రారెడ్డిల పర్యవేక్షణలో 'ధ్వజస్థంభం ప్రతిష్ట కార్యక్రమాలు ఏర్పాటు చేసారు.

ఎంఎల్‌సి ధాతృత్వంతో ...

ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో నిర్వహించనున్న కుంబాభిషేకానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నేపద్యంలో అబివృద్ధి కార్యక్రమాల్లో పలువురిని బాగస్వాములు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో నెల్లూరకు చెందిన ఎంఎల్‌సి బీదరవీంద్రజ్యోతిలను కలసి అభ్యర్ధించగా వారు ధ్వజస్థంభం ఏర్పాటుకు సుముఖత చూపారు. ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమాల్లో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుదీర్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దువ్వూరుపై చర్యలు తీసుకోండి!

సూళ్ళూరుపేట – వాకాడు, మార్చి 30 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా వాకాడు మండల పరిధిలోని కెన్సెస్ ఇండస్ట్రియల్ పార్క్ పరిధిలో ఉన్న భూములను ఆక్రమించి రొయ్యల చెరువు ఏర్పాటు చేసిన తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, వారి అల్లుడు వాకాడు మండల తెలుగు దేశం పార్టీ ఇన్చార్జి దువ్వూరు మదుసూధన్ రెడ్డి వారి అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, మాకు న్యాయం చేయాలని కెన్సెస్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రతినిధి సూళ్ళూరుపేట ఆర్‌డిఓకు సోమవారం వినతి పత్రం సమర్పించి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాకాడు మండలంలోని అందలమాల, పాతేటిపాళెం, వాగ్రు, వాలవేడు, జమిన్ కొత్తపాళెం, బూడిదల వాగు, నామకాడు బిట్-1 పరిధిలో 1002 ఎకరముల భూములు ఉన్నాయని, ఆ భూముల్లో కెన్సెస్ ఇన్‌ఫ్రాస్టక్చరల్ పార్క్ ఏర్పాటు చేయడానికి 2025 నవంబర్ 14,15వ తేదీలో వైజాగ్‌లో జరిగిన పెట్టుబడుల ప్రోత్సాహక మండల సదస్సు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నామన్నారు. వాకాడ మండలం బూడిదలవాగు గ్రామ లెక్కదాఖలలో 1992 – 93 సంవత్సరంలో సర్వే నంబర్ 123, 125లోని 6.92 సెంట్ల భూమిని తమ కంపెనీ పేరు మీద చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నామన్నారు. ఆ భూమి నాటి నుండి నేటి వరకు తమ స్వాధీనంలో ఉందన్నారు. అయితే కెన్సెస్ ఇన్‌ఫ్రాస్టెక్చర్ పార్క్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తుండగా తమకు ఆ భూమిని అమ్మిన తిరుమూరు శ్రీనివాసులురెడ్డి వారి అల్లుడు వాకాడు మండలం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి దువ్వూరు మదుసూధన్ రెడ్డిలు కొంత మంది వ్యక్తులతో మా అనుమతి లేకుండా తమ భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి 4.71 సెంట్ల భూమిని తమ భూమి అని చెప్పి తగిన ఆధారం లేకపోయినను స్వాధీనం పరచుకోవాలని చూస్తున్నారన్నారు. ప్రస్తుతం వారు ఆ భూములు దౌర్జన్యంగా ఆక్రమించుకుని రెండు ఎకరాల్లో రొయ్యలు గుంటలు చేసి, రొయ్యల పిల్లలను వదిలారన్నారు. తమ పట్టాభూమిని వారు దౌర్జన్యంగా మా నుండి స్వాధీనం పరచుకోవాలని చూస్తున్నారని తెలిపారు. ఇదే విషయమై వాకాడు తహశీల్దార్‌కి వివరించినా తమకు న్యాయం జరగలేదని తెలిపారు. అందువల్ల సూళ్ళూరుపేట ఆర్డివో తమ కంపెనీ తాలుకా భూమికి చెందిన రికార్డులను పరిశీలించి తమ కంపెనీ ఏర్పాటు దువ్వూరు మధుసూధన్ రెడ్డి ఏలాంటి ఆటంకాలు, సమస్యలు లేకుండా తగిన న్యాయం చేయాలని కోరారు.

## ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు



రేణిగుంట, మార్చి 30 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో సోమవారం రాత్రి ఘనంగా వీడ్కోలు లభించింది. తిరుపతి పర్యటన ముగించుకుని సోమవారం రాత్రి రేణిగుంట విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో తిరుగు పయనమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వీడ్కోలు పలికిన వారిలోముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న, రెవెన్యూ, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమాల పరివేక్షకుడు పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, డిఐజీ షిమోజి బాయ్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఆర్‌డిఓ బానుప్రకాష్ రెడ్డి రేణిగుంట తాహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, పలువురు పార్టీ , అధికార ప్రతినిధులు ఉన్నారు.

## సిఎం చంద్రబాబుకు ఆత్మీయ స్వాగతం



తిరుపతి,మార్చి 30ప్రభాతవార్త: ఒక్క రోజు పర్యటన నిమిత్తం సోమవారం సాయంత్రం తిరుపతిలో హెలిప్యాడ్ కు చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఆత్మీయస్వాగతం లభించింది. సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బారాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్. గోవింద రావు, ఎంఎల్‌సి బల్లి కళ్యాణ చక్రవర్తి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ చైర్మన్ రవి నాయుడు,తుడ చైర్మన్ సి దివాకర్ రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ సి కె. బాబు, సుగుణమ్మ, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్,, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ,డాక్టర్ సప్తగిరిప్రసాద్, జెబి శ్రీనివాస్ స్వాగతం పలికారు.

## సహజసిద్ధ ప్రకృతిని తలపించిన వసంతమండపం



తిరుమల,మార్చి 30ప్రభాతవార్తప్రతినిధి: వేసవి వేడి నుండి ఉపశమనం కల్పించేందుకు ఏడుకొండల స్వామి ఉత్స వమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్ప స్వామికి వసంతోత్సవాలు మొదలయ్యాయి. ఇందుకోసం ఆలయానికి పడమర వైపు ఉన్న వసంతమండపాన్ని సహజసిద్ధంగా ప్రకృతి అడవిగా తీర్చిదిద్దారు. వట్టి వేరులు ,వన్య మృగాల సమూహాలతో వసంత మండపం రూపుదిద్దారు. పలురకాల మధురఫలాలు, పూలు, వేలాడే కోతులు, ఏనుగులు, సింహాలు, పులులు, నెమళ్లు, పాముల తదితర జంతువులు, పలురకాల చెట్ల ప్రతిరూపాలతో శేషాచల అడవిని తలపించేలా ఈ మండపాన్ని తీర్చిదిద్దడం భక్తులను ఆకట్టుకుంది.

**CHANGE OF NAME**

I, **PATHAN AYUB KHAN, S/o Azees Khan Pathan** (Old Name), R/at DNo.8-127-A, Kaikala Street, Kothapet, Srikalahasti, Tirupati District, A.P-517 644, have changed my name to **Patan Ayub Khan,** S/o P.Azees Khan (New Name) for all purposes.

## దీనదయాళ్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

**– పిడబ్ల్యుడి రాష్ట్ర కార్యదర్శి కొండమ్రి సుబ్రహ్మణ్యం**

**తిరుపతి హెల్త్, మార్చి 30, ప్రభాతవార్త**




శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటి హిస్టరీ డిపార్ట్‌మెంట్‌లో అకాడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న ఎం. దీనదయాళ్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని పిడబ్ల్యుడి రాష్ట్ర కార్యదర్శి కొండమ్రి సుబ్రహ్మణ్యం కోరారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీన దయాళ్ కి సుమారు 13 సంవత్సరాల అనుభవం ఉన్నదన్నారు. 2025 – 26 అకాడమిక్ సంవత్సరానికి గాను రివ్యూ ఆఫ్ పెర్ఫార్మన్స్ పరీక్ష పెట్టి అతనిని ఎస్వీ యూనివర్సిటీ ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. తనకు ఉద్యోగ భద్రత కల్పించాలని పర్సన్స్ విత్ డిజబిలిటీస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొండమ్రి సుబ్రహ్మణ్యం కోరారు. హిస్టరీ శాఖలో రివ్యూ ఆఫ్ పెర్ఫార్మెన్స్‌లో సెలెక్ట్ అయినటువంటి అభ్యర్థులలో మల్లికార్జున్ తప్ప మిగిలిన ముగ్గురు అభ్యర్థుల రీసెర్చ్ పేపర్స్ మొత్తాన్ని కలిపినా ఇతని కున్న అనుభవం, అధ్యాపక అనుభవం లేదని పేర్కొన్నారు. హిస్టరీ డిపార్ట్మెంట్లో అకాడమిక్ కన్సల్టెంట్గా పనిచేస్తున్న ఒకే ఒక దివ్యాంగుడైన దీనదయాళ్‌ను ఉద్యోగం నుంచి తొలగించడం దారుణమన్నారు. దివ్యాంగ చట్టం ప్రకారం గాని మెరిట్ ప్రకారంగానే ఎక్స్పీరియన్స్ ఆధారంగా గాని దీన దయాలకు యూనివర్సిటీ వారు ఉద్యోగం కల్పించాలని కోరారు. దీన దయాళ్ ఆర్థికంగా వెనుకబడిన వాడు చాలా పేదవాడని, అతనికి 80 సంవత్సరాలు వయసు ఉన్న తల్లి,ఇద్దరు పిల్లలు,భార్య ఉన్నారని,అందరూ ఇతని జీతం మీదనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఇతనికి జీతం తప్ప మరి ఏ ఆదాయం, సంపద లేదని ఉద్యోగం నుంచి తొలగించబడడంతో ఏడు నెలలుగా కనీస అవసరాలు కూడా తీర్చుకోలేకపోతున్నాని, చాలా దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్నానని దీన దయాళ్ పేర్కొన్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల కమిషనర్, ఎస్వి యూనివర్సిటీ అధికారులకు, 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం అతని ఉద్యోగం అతనికి ఇవ్వమని, యూనివర్సిటీ అధికారులకు తెలియజేశారు అన్నారు. వాళ్ల ఆదేశాలను అధికారులు లెక్క చేయలేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ,గవర్నర్, ఉపరాష్ట్రపతి కార్యాలయాలు,జిల్లా కలెక్టర్ కూడా దీనదయాళ్‌కు న్యాయం చేయాలని యూనివర్సిటీ అధికారులకు ఉత్తరాలు పంపారని అన్నారు. అయినా కూడా అధికారులు అందించలేదని పేర్కొన్నాడు. తనకు న్యాయం చేయాలని యూనివర్సిటీ రిజిస్టర్‌ని, సంబంధిత అధికారులను కోరుతున్నానని చెప్పారు.

## బార్ అసోసియేషన్ సెక్రటరీగా రెండవ సారి విద్యానాథరెడ్డి గెలుపు

**తిరుపతి, మార్చి 30 ప్రభాతవార్త:**

తిరుపతి బార్‌అసోసియేషన్ 2026–27 సంవత్సరానికి జరిగిన ఎన్నికల ఫలితాలు సోమవారం ప్రకటించారు. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో టి.గోపిచంద్(434) ఓట్లు సాధించి విజయం సాధించారు. ఆయనకు ప్రత్యర్థి ఓ.రాజమాణిక్యం(398) ఓట్లు పొందగా, బి.ఉషాకిరణ్(94) ఓట్లు పొందారు. నోటాకు 7 ఓట్లు వచ్చాయి. టి.గోపిచంద్(36) ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఉపాధ్యక్ష పదవికి సి.శంకర్‌రెడ్డి(527) ఓట్లు సాధించి విజయం సాధించారు. జి.హరినాథనాయుడు(219) ఓట్లు, జి.మధుసూదన్ రావు(178) ఓట్లు పొందారు. నోటాకు(9) ఓట్లు వచ్చాయి. సి.శంకర్‌రెడ్డి(308) ఓట్ల మెజారిటీతో గెలిచారు. కార్యదర్శి పదవికి వి.విద్యానాథరెడ్డి(501) ఓట్లు సాధించి విజయం సాధించారు. జోసెఫ్ మార్టిన్(416) ఓట్లు పొందగా, నోటాకు 16 ఓట్లు వచ్చాయి. వి.విద్యానాథరెడ్డి(85) ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఫలితాలను ఎన్నికల అధికారి ఎస్.నవీన్‌కుమార్ ప్రకటించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఎన్నికలను నిర్వహించిన ఎన్నికల బృందానికి మరి న్యాయవాదులకు ఎన్నికల అధికారి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## ముఖ్యమంత్రిని కలసిన కూరపాటి శంకర్‌రెడ్డి

**సత్యవేడు, మార్చి 30 ప్రభాతవార్త:**



తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీలో పీ4 వార్షికోత్సవం సందర్భంగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదరిక నిర్మూలన లక్ష్యంతో తీసుకొచ్చిన పీ4 ప్రారంభించి నేటితో ఏడాది అయిన సందర్భంగా పద్మావతి యూనివర్సిటీలో వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యవేడు టీడీపీ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి తిరుపతి హెలిప్యాడ్ వద్ద మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి చంద్రబబునాయుడుని కలిశారు.

## పి4 ఒక పథకం కాదు...ప్రజా ఉద్యమం

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**

**పుత్తూరు (నగరి), మార్చి 30 ప్రభాతవార్త :**



పి4 అనేది కేవలం ఒక ప్రభుత్వ పథకం కాదని, సమాజాన్ని పేదరికం నుంచి శాశ్వతంగా బయటకు తీసుకువచ్చే ప్రజా ఉద్యమమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ పేర్కొన్నారు. ఒక కుటుంబం మరో కుటుంబాన్ని ఆదుకునే ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జీరో పావర్టీ – పి4 కార్యక్రమం విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా నగరి మునిసిపాలిటీలో సోమవారం ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా సమగ్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు పి4 పథకాన్ని రూపొందించారని తెలిపారు. ఇందులో భాగంగా అత్యంత పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చేందుకు వారికి అండగా నిలిచే దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు, సంస్థలను మార్గదర్శకులుగా గుర్తించి వారి ద్వారా ఆయా కుటుంబాలకు విద్య, ఆరోగ్యం, ఉపాధి తదితర అన్ని రంగాల్లో తోడ్పాటు అందిస్తారని వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మార్గదర్శులు, స్వచ్ఛంధ సంస్థలు, అధికారులు తదితరులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుపై ఆసక్తి చూపాలి..

**పెద్దపంజాణి మార్చి 30 ప్రభాతవార్త :**



రైతులు ప్రకృతి వ్యవసాయ పంటల సాగుపై ఆసక్తి చూపాలని ఏడీఏ వాసు కోరారు.ఆత్మ ఆధ్వర్యంలో సోమవారం రామాపురం గ్రామంలో 30మంది రైతులకు పంటలసాగు ప్రకృతి వ్యవసాయ విధానాలపై రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ముఖ్య అతిదిలుగా సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీరాములు, లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు హాజరయ్యారు. ఏడీఏ మాట్లాడుతూ..వేరుశనగ, వరిపంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. అలాగే యూరియా,ఎరువులు అధికంగావాడితే భూసారిన్ని సైతం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయాలపై ఆసక్తి చూపాలని సూచించారు.పిఏసిఎస్ శ్రీరాములు,లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు మాట్లాడుతూ..రైతులు కూటమి ప్రభుత్వం రైతుతలకు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సిఎం చంద్రబాబునాయుడు రైతుల పక్షపాతిఅని పేర్కొన్నారు.పలమనేరు,పుంగనూరు నాయోజకవర్గల్లో రైతులకు క్రిష్ణాజలాల ద్వారా సాగునీరు అందిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి హేమలత,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఈ పాస్‌బుక్‌ల పంపిణి

**ఏర్పేడు,మార్చి 30 ప్రభాతవార్త**

ఏర్పేడు మండలంలో సోమవారం రైతులకు ఈ పాస్‌బుక్‌లను అందించారు. ప్రభుత్వం రూపొందించిన ఈ పాస్‌బుక్‌లను అందజేయుటకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో రైతులకు పాస్ పుస్తకాల పంపిణి కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని కోరుకునే తెలుగుదేశం నాయకుడు రైతులకు పక్కా రికార్డులు అందించుటకు రూపకల్పన చేసారన్నారు. ఈ నేపధ్యంలో రైతు భూములు ఒరైతుల పేరు మీద ఉంటాయన్నారు.గత ప్రభుత్వం నాయకుడు రైతుల పట్టాదారు పుస్తకాలపై తన ఫోటోను ముద్రించుకున్నారని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రభుత్వ రాజముద్రతో అందిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ భార్గవి పాస్‌పుస్తకాలను అందజేసారు.

## పదవీ విరమణ సన్మాన కార్యక్రమం

**పుత్తూరు రూరల్, మార్చి 30 ప్రభాతవార్త:**



పుత్తూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి సోమవారం పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుత్తూరు డీవైఈవో మహేశ్వరరావు పాల్గొన్నారు. సోమవారం పుత్తూరు పట్టణంలోని గేట్ పుత్తూరు జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డీవైఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు భువనేశ్వరి 38 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది విద్యార్థులకు చదువు నేర్పి మంచి ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలియజేశారు. భువనేశ్వరి మాట్లాడుతూ నా యొక్క ఉపాధ్యాయ వృత్తి ప్రతి పాఠశాలల్లో కూడా గౌరవంతో ఉంటూ ప్రతి విద్యార్థి కూడా నాతో మంచి స్నేహభావంతో ఉంటూ మంచి విద్యను నేర్చుకోవడం అని తెలిపారు. అనంతరం భువనేశ్వరి దంపతులను పూలమాల, శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వం పని చేసిన ప్రభాకర్‌రాజు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు సురేష్, చంద్రశేఖర్, మండల విద్యాశాఖ అధికారులు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యంరాజు, ప్రభాకర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎంపీపీ రెడ్డివారి భాస్కర్‌రెడ్డిచే సర్పంచ్‌లకు ఘన సన్మానం

**నింద్ర, మార్చి 30 ప్రభాతవార్త:**



నింద్ర ఎంపీపీ రెడ్డివారి భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగానింద్ర మండలంలోని గ్రామ సర్పంచ్‌లకు సోమవారం కొప్పేడు గ్రామంలో ఘన సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌లు గత 5 సంవత్సరాలుగా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేశారని,అదే విధంగా రాబోవు రోజుల్లో కూడా ప్రజలకు అందుబాటులో ఉండి మీసేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, వైస్ ఎంపీపీ దుర్గా, సర్పంచ్‌లు మనోహర్‌నాయుడు,జయచంద్రారెడ్డి, ప్రభాకర్, మహేష్, బాలకృష్ణమరాజు, జయమ్మ,టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు తంగరాజు, భాస్కర్, మురళీనాయుడు, నాగభూషణంరాజు, రవినాయుడు, శరవణ తదితరులు పాల్గొన్నారు.

## కోలాహలంగా క్రీడాభారతి కబడ్డీ పోటీలు

**తిరుపతిరూరల్, మార్చి 30 ప్రభాతవార్త:**





క్రీడాభారతి, హెచ్ఎన్ఆర్ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా కబడ్డీ పోటీలు ఉత్సాహం ముగిశాయి. వివిధ మండలాల నుంచి అండర్ –14, అండర్–19 బాలురు, బాలికల విభాగాల్లో మొత్తం 70 జట్లు పోటీపడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తిరుచానూరు మార్కెట్ చైర్మెన్ మౌనిక మునిశేఖర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక దృఢత్వానికి బాటలు వేస్తాయని తెలిపారు. యువత మొబైల్ ప్రభావంతో క్రీడలను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కబడ్డీ వంటి ప్రాచీన క్రీడలను కాపాడుకోవాల్సి అవసరం ఉందన్నారు. ఈ పోటీల్లో అండర్–14 గర్ల్స్‌లో ఏఎస్ఏ స్పోర్ట్స్ క్లబ్ తొలి స్థానం సాధించగా, అండర్–19 గర్ల్స్‌లో కెవిఎస్–ఏ జట్టు విజేతగా నిలిచింది. అండర్–14బాయ్స్‌లో వెరిటాస్ సైనిక్ స్కూల్ అండర్–19 బాయ్స్‌లో ఎస్వీ డిఫెన్స్ పాఠశాల మొదటి స్థానాలు దక్కించుకున్నాయి. విజేతలకు ట్రోఫీలు, పతకాలు ప్రదానం చేశారు. ఈ పోటీల నిర్వాహణలో కీలక పాత్ర పోషించిన నిర్వాహకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు చెరుకూరి వెంకటేశ్వరప్రసాద్, హెచ్ఎన్ఆర్ ప్రాజెక్టు ప్రతినిధి కామసాని నరసింహారెడ్డి లతో పాటు క్రీడాభారతి ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అండర్–19 విభాగాల్లో గెలిచిన జట్లకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు.

## మార్కాపురాన్ని కాటమరాజు జిల్లాగా ప్రకటించాలి

**రేణిగుంట, మార్చి 30 ప్రభాతవార్త**



మార్కాపురం జిల్లాను కాటమరాజు జిల్లాగా ప్రకటించాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. భారతదేశంలో ఎంతోమంది రాజులు ఉన్నప్పటికీ కొంతమందిని మాత్రమే హిందూ ధర్మాన్ని కాపాడడం కోసం ఆలయాలు నిర్మించారని అన్నారు. అలాంటి వారిలో కాటమరాజు చాలా ముఖ్యమైన రాజుగా అభివర్ధించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆయన ద్వారా అనేక దేవాలయాలు వెలిశాయన్నారు. మార్కాపురంలో జరిగే కాటమరాజు గంగాదేవి ఆలయాల్లో జరిగే జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వస్తారన్నారు. 13వ శతాబ్దాన్ని చెందిన కాటంరాజు యాదవ వంశానికే కాకుండా తెలుగు నేలకే గర్వకారణమని తెలిపారు. ఆయన పేరుతో జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. కాటమరాజు, గంగాదేవి తిరునాళ్లను రాష్ట్రీయ పండుగలుగా ప్రకటించాలన్నారు.

## విజయవంతమైన సీఎంఈ కార్యక్రమం

**– వైద్యుల సహకారానికి ఐఎంఏ కృతజ్ఞతలు**

**తిరుపతి హెల్త్, మార్చి 30, ప్రభాతవార్త**



ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తిరుపతి శాఖ ఆధ్వర్యంలో ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రిలో నిర్వహించిన సీఎంఈ కార్యక్రమం విజయవం తం గా పూర్తైన సందర్భంగా పాల్గొన్న వైద్యులందరికీ ఐఎంఏ తరపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి తిరుపతి నగరంలోని వైద్యులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయడం ఆనందదాయకమని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఏ.ఆర్. రెడ్డి తెలిపారు. కోశాధికారి డాక్టర్ పి. రెడ్డప్ప కూడా వైద్యుల సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.వైద్య రంగ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి తేవడం, ప్రభుత్వం–వైద్యుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అలాగే వైద్య సేవల అభివృద్ధి, నాణ్యమైన సేవల అందింపు, వైద్య వృత్తిలోని సవాళ్లు–అవకాశాలపై విస్తృతంగా చర్చించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, డాక్టర్ శ్రీహరి రావు, డాక్టర్ సునంద కుమార్, డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినందుకు ఐఎంఏ అధ్యక్షుడు ఆర్. ఆర్. రెడ్డిని కోశాధికారి డాక్టర్ రెడ్డప్పను అభినందించారు.

## సర్పంచులకు ఘనసన్మానం.

**పెద్దపంజాణి మార్చి 30 ప్రభాతవార్త :**



ఏప్రిల్ 2వతేదీతో ఐదేళ్ళ పదవీ కాలాన్ని పూర్తీ చేసుకోనున్న గ్రామపంచాయతీ సర్పంచులను సోమవారం వైకాపా మండల కన్వీనర్ బాగారెడ్డి,వైకాపా జిల్లా ప్రదాన కార్యదర్శి తమ్మిరెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఐదేళ్ళకాలంలో మండలం లోని సర్పంచులు ఆయాపంచాయతీల అభివృద్ధికి చూపినచొరవ ప్రశంసనీయమన్నారు.పదవీకాలం ముగిసిన తరువాతకూడా సర్పంచులు ఆయా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులోఉండి వారిసమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని పేర్కొన్నారు.అవకాశం ఉంటే ప్రజల్లోఉన్న సర్పంచులకు మరలా సర్పంచు అవకాశాలను లేదా సర్పంచ్‌సీట్లను పార్టీఅధిష్ఠాటనం కల్పిస్తుందని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

**–ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**

**తిరుపతి,మార్చి 30ప్రభాతవార్తప్రతినిధి:**




ఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ సంస్థ పరిధిలో వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో చోటుచేసుకుంటున్న జాప్యాన్ని సీఎండి దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రైతులకు ఫోన్ చేసి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. సర్వీసుల మంజూరులో నిబంధనలను అతిక్రమిస్తే సంబంధిత అధికారులు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 ,1800 425 155333కు కాల్ చేయడం ,వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.

## బయోమెడికల్ సైన్సెస్‌లో ఆవిష్కరణలు

**యూనివర్సిటీ(తిరుపతి), మార్చి 30ప్రభాతవార్త:**



భారత ప్రభుత్వ ప్రిజమ్ పథకం కింద డిఎస్ఐఆర్–టెప్ ఔట్రీచ్ కమ్ క్లస్టర్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లో బయోమెడికల్ సైన్సెస్‌లో ఆవిష్కరణలు ,ప్రపంచ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం అంశంపై జాతీయ సదస్సు నిర్వహించబడింది. బయోమెడికల్ రంగంలో ఆలోచనలను పంచుకోవడానికి , ఆవిష్కరణఆధారిత పరిష్కారాలను ప్రోత్సహించడానికి వైద్య విద్యార్థులు, పరిశోధన పండితులు, విద్యావేత్తలు , ఆరోగ్య సంరక్షణ స్టార్టప్ కంపెనీలను ఒకచోట చేర్చేందుకు ఈ సదస్సు ఒక చైతన్యవంతమైన వేదికగా ఉపయోగపడింది. కోఆర్డినేటర్ ప్రొఫెసర్ పి. జోత్స్న ప్రారంభోపన్యాసంతో లాంఛనప్రాయ ప్రారంభోత్సవంతో మొదలైంది. సీఈఓ, జర్మనీలోని ఫ్రాన్‌హోఫర్ గెసెల్‌షాఫ్ట్‌లో సీనియర్ సైంటిస్ట్ అయిన డాక్టర్ నాగరాజు సల్లాగుండల, ప్రపంచ ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థల ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, విస్తరించదగిన ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి విద్యాసంస్థలు, పరిశ్రమలు స్టార్టప్‌ల మధ్య సహకార ప్రయత్నాల ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ముఖ్య అతిథి, పద్మావతి వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి. ఉమా సామాజిక ప్రయోజనం కోసం ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో విద్యా సంస్థల కీలక పాత్ర గురించి మాట్లాడారు. గ్లోబల్ హెల్త్ఎక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ కె. రవీంద్రనాథ్ కీలకోపన్యాసం చేశారు. ప్రదర్శనలు పరిశోధన, ఆవిష్కరణ వ్యవస్థాపకతలో చురుకుగా పాల్గొనడానికి పాల్గొనేవారిని ప్రేరేపించాయి. ఆరోగ్య సంరక్షణలో స్వీకరణ" అనే అంశంపై ప్యానెల్ చర్చ జరిగింది. ఈ చర్చలో డాక్టర్ కె. రవీంద్రనాథ్, డాక్టర్ అల్లాడి మోహన్,డాక్టర్ రమాదేవి ,డాక్టర్ వై. భవానీ కుమార్ డా. నాగరాజు సల్లాగుండల, రియాజ్ బాషా పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే సీజ్..

**25 బస్సులపై కేసులు**

**తిరుపతి రవాణ మార్చి 30 ప్రభారత వార్త**



కాంట్రాక్ట్ క్యారేజీ బస్సుల్లో భద్రతా లోపాలపై జిల్లా రవాణా శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. నిబంధనలు పాటించని వాహనాలపై వరుస తనిఖీలు చేపట్టిన అధికారులు, గత రెండు రోజుల్లో 25 బస్సులపై కేసులు నమోదు చేసి సుమారు రూ.5 లక్షల అపరాధ రుసుము విధించారు. అదేవిధంగా అత్యవసర ద్వారాలకు అడ్డంగా బెర్త్‌లు ఏర్పాటు చేసిన రెండు బస్సులను స్వాధీనం చేసుకున్నారు.ఇటీవల రాష్ట్రంలో కాంట్రాక్ట్ క్యారేజీ బస్సుల ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన రవాణా శాఖ, ట్రావెల్స్ యాజమాన్యాలతో సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా అధికారులు భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి నిరక్ష ్యం సహించబోమని స్పష్టం చేశారు.జిల్లా రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ, వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. సీనియర్ మోటార్ వాహనాల తనిఖీ అధికారి వనం వెంకట సుబ్రహ్మణ్యం, స్లీపర్ బస్సుల్లో ఎ ఐస్ నిబంధనలు పాటించడంతో పాటు ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ల వివరాలను ప్రయాణికులకు ముందుగానే తెలియజేయాలని పేర్కొన్నారు.పుత్తూరు ఎంవిఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ, డ్రైవర్లు వేగ పరిమితులు కచ్చితంగా పాటించాలని, అలసటతో డ్రైవింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే రియర్ ఇంజిన్ స్లీపర్ బస్సుల్లో ఫైర్ డిటెక్షన్ సప్రెషన్ సిస్టమ్ సక్రమంగా పనిచేసేలా ఉండాలని చెప్పారు.రవాణా శాఖ అధికారులు నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై నిరంతర తనిఖీలు కొనసాగుతాయని, భద్రతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు అతికానాజ్, స్వర్ణలత, పరిపాలన అధికారులు విజయ్ కుమార్, విజయ ప్రశాంతి, యువకిశోర్ , ట్రావెల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 2న జిల్లా స్థాయి శాప్ లీగ్ - వాటర్ స్పోర్ట్స్ పోటీలు

**తిరుపతి క్రీడ, మార్చి 30, ప్రభాతవార్త**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ వారి ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న జిల్లా స్థాయి వాటర్ స్పోర్ట్స్ (అబ్బాయి, అమ్మాయి) పోటీలు నిర్వహించి, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు ఎంపిక చేయనున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యన్. శశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యన్. శశిధర్ మాట్లాడుతూ రాయలచెరువు జిల్లా స్థాయి టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ వాటర్ స్పోర్ట్స్ అండర్ 15 , అండర్ 18 (కానోయింగ్, కయాకింగ్, రోయింగ్, డ్రాగన్ బోట్) జరగనున్నాయన్నారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన వారు ఏప్రిల్ 10,11 తేదీల్లో ఎన్‌టిఆర్ జిల్లాలో జరగనున్న వాటర్ స్పోర్ట్స్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు డిల్లి ప్రసాద్ 8919564478, ఈ. గోపి9059606346, కె.వినోద్ 99666882029, సంప్రదించాలన్నారు. ఏప్రిల్ 2న జిల్లా స్థాయి వాటర్ స్పోర్ట్స్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌లో పాల్గొనుటకు శాప్ వైబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యన్. శశిధర్ తెలిపారు. రిజిస్ట్రేషన్ కొరకు శాప్ వెబ్‌సైట్: డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. స్పోర్ట్స్.ఏపి.జీవోవి.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలిపారు.

## బోరు ప్రారంభం

**రేణిగుంట, మార్చి 30 ప్రభాతవార్త**



రేణిగుంట మండలం గుత్తి వారి పల్లి పంచాయతీ మోడీ వారి ఇళ్లలో ఇటీవల కాలంలో ఆషా స్వ చ్ఛంద సేవా సంస్థ వేసిన బోరును సోమవారం కడప జిల్లా కాజీపేట పద్మ మహిళా మండలి ప్రాజెక్టు ఆఫీసర్ జూలి యన్ రాజు, రేణిగుంట మండ లానికి చెందిన పలువురు టిడిపి నేతలు ప్రారంభించారు. బోరు నీరు తీయగా స్వచ్ఛంగా రావడం తో ఆ ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు మును స్వామి నాయుడు, టిడిపి సీనియర్ నేత వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నారెడ్డి, స్థానిక సర్పం చి మంజుల, ఆశా వర్కర్ భారతి, ద్వారక నాయుడు, ముద్దు కృష్ణ, సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్






నాయుడుపేట మండలం పుదూరు గ్రామంలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, లబ్ధిదారులతో ముఖ్యమంత్రి – ప్రభాతవార్త, నాయుడుపేట

జవాబుదారి లేని అధికారులు...

## మా కవసరం లేదు: వెళ్ళండి

### పి.ఫోర్ సమీక్ష నుంచి శ్రీకాళహస్తి,ఏర్పేడు అధికారులపై ఎంఎల్ఏ ఫైర్




శ్రీకాళహస్తి,మార్చి30 ప్రభాతవార్త: 'ప్రభుత్వం ఎంతో జవాబుదారి తనంతో నిరుపేదలకు సహాయం చేయటానికి పథకాలు రూపొందిస్తుంది. ప్రతి మండలంలో బంగారు కుటుంబ సభ్యులను ఎంపిక చేసారు.ఈ రోజు వారిని సత్కరించుటకు సోమవారం సమావేశం ఏర్పాటు చేస్తే బంగారు కుటుంబ సభ్యులు హాజరు కాకపోవటంతో శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అధికారుల మీద శివమెత్తారు. ఒక దశలో అధికారుల తీరుపై సహనం కోల్పోయిన ఎంఎల్ఏ ఇరిటేషన్‌తో 'జవాబుదారి తనం లేని అధికారులు నా నియోజకవర్గంలో అవసరం లేదు. సమావేశం నుంచి వెళ్లండి' వెళ్ళి జిల్లా కలెక్టర్‌కు సంజాయిషి ఇచ్చుకోండని శివమెత్తారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి, ఏర్పేడు మండల అభివృద్ది కారులను వారి సిబ్బందిని సమావేశం నుంచి తరిమి వేసారు.ప్రజల కోసం పని చేయని ఏ అధికారి కానీ సిబ్బంది కానీ తనకు అవసరం లేదని స్పష్టం చేసారు.సోమవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు 'పి -4 సమీక్షా సమావేశాన్ని' శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఏర్పాటు చేసారు. అయితే ఏ లక్ష్యంతో అయితే సమావేశం ఏర్పాటు చేసారు. ఆ లక్ష్యాన్ని పంచుకోవాల్సిన 'బంగారు కుటుంబాలు' హాజరు కాకపోవటంతో ఆయనకు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు.

**అధికారుల తీరు మారాలి!:**

ఈ సందర్బంగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనాయుడు నారాలోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిధుల సాదనకు రేయింబవళ్లు కేంద్రం వద్దకు పరుగులు తీస్తున్నారు. వాటిని సమాజ సంక్షేమానికి నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేయటానికి కృషి చేస్తుంటే వాటిని చేరవేయాల్సిన కొందరు అధికారులు ఇలా వ్యవహారించటం బాధాకరమన్నారు. ప్రభుత్వంలో నాయకులు తాము కంటిమీద కునుకు లేకుండా అభివృద్ది కోసం పని చేస్తుంటే అధికారులు దర్జాగా నిరుపేదల గురించి పట్టించుకోక పోవటం బాధాకరమన్నారు. అధికారుల తీరుతో ప్రభుత్వం చేస్తున్న కృషి సాధిస్తున్న నిధులు సక్రంగా సద్వినియోగం కావటం లేదని అంతేకాక ప్రభుత్వం అందిస్తున్న పథకాలు లబ్దిదారులకు సరిగ్గా చేరటం లేదని ధ్వజమెత్తారు. అధికారుల తీరు మారాలి. నిద్రమత్తు నుంచి మేల్కోనాలి. అంటూ సూచించారు. ప్రభుత్వం చుట్టుపక్కల ఉన్న కంపెనీలకు భాగస్వామ్యం చేస్తూ 'బంగారు కుటుంబాలను ఎంపిక చేసి ఆ కుటుంబాల అభివద్ధికి పాటు పడుతుంటే ఈ పథకంలో లబ్దిదారులు హాజరు కాకపోవటం ఏమిటి? నాకేం పని లేకనా? నేను చిత్తశుద్దితో పని చేస్తున్నపుడు అధికారుల సహాకరించకపోతే నేనెందుకు ప్రభుత్వం వద్ద చేతులుకట్టుకొని సమాధానం చెప్పాలి? విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన శ్రీకాళహస్తి,తొట్టంబేడు మండల పరిషత్ అధికారులను సస్పెండ్ చేయాలని శాసనసభ్యుడు సుదీర్‌రెడ్డి కోరారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన వివరించారు.

## రైలు కిందపడి మహిళ ఆత్మహత్య!

రైల్వేకోడూరు రూరల్, మార్చి 30 ప్రభాతవార్త: రైల్వే కోడూరు మండలంలోని సెట్టిగుంట సమీపంలో 55 సంవత్సరాలు కలిగిన స్త్రీ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వేకోడూరు ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఇందులో ముక్కు నుండి రక్తం కారుతూ, తలభాగం కుడివైపు చీలి బలమైన రక్త గాయము ఏర్పడిందని అదేవిధంగా తెల్లని మరియు బ్లూ కలర్ కలిగిన చీర, బ్లూ కలర్ కలిగిన జాకెట్ ఆకుపచ్చ కలిగిన లంగా వేసుకొని ఉండాదని వారు తెలిపారు. అయితే ఈ మహిళ గుర్తుతెలియని మహిళగా గుర్తించారని ఈమె సెట్టిగుంట సమీపంలో గూడ్స్ రైళ్లను ఢీకొన్నట్లు రైల్వే పోలీసులు కోడూరు ఎస్సై కి వివరాలు తెలిపినట్లు ఆయన విలేకరులకు తెలియజేశారు.

## మహిళపై మరో మహిళ దాడి!

శ్రీకాళహస్తిరూరల్,మార్చి 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం అక్కూర్తి గ్రామంలో ఇద్దరు మహిళ మధ్య గొడవతో ఓమహిళ గాయపడి ఆసుపత్రి పాలైంది. అక్కూర్తి గ్రామానికి చెందిన టి.పుష్పలత,అదే గ్రామానికి చెందిన తిరుపాలయ్య మధ్య వివాదం పుష్పలతను ఆసుపత్రి పాల్జేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. అక్కూర్తి గ్రామానికి చెందిన పుష్పలత ఇంటికిదారి లేకుండా చేయటంతో వివాదం చెలరేగింది.ఈ వివాదానికి సంబంధించి పుష్పలత తహశీల్దార్‌కు తన విన్నపాన్ని అందించారు. అయితే ఈ వివాదానికి సంబంధించి శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయటంతోస్పందనలేక పోవటంతో తిరుపతిలోని గ్రీవెన్స్‌కు రెండు సార్లు మొరబెట్టుకున్నట్లు వివరించారు.అయితే దారికి సంబంధించి రెవెన్యూశాఖ అధికారులు డాక్యుమెంట్లను వక్రీకరించినట్లు పుష్పలత చెబుతున్నారు. దాంతో సోమవారం తిరుపాలయ్య బంధువులు పుష్పలతపై దాడి చేయగా అమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## యువకుడు ఆత్మహత్య

రేణిగుంట, మార్చి 30 ప్రభాతవార్త : రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని తాతయ్య కాలవ ఎస్సీ కాలనీకి చెందిన అనిల్ చెట్టుకు ఉరేసుకొని మృతి చెందిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. రూరల్ సీఐ మంజునాథరెడ్డి కథనం మేరకు తాతయ్య కాలవకు చెందిన అనిల్ చిన్నప్పుడే తల్లితండ్రులు చనిపోవడంతో అతని పెదనాన్న మునయ్య వద్ద పెరుగుతూ ఎలక్ట్రిషన్ పనులు నేర్చుకున్నాడు. ఎలక్ట్రిషన్ పనులు చేస్తూ జీవిస్తున్న అతను తరచు మద్యం సేవించి తల్లిదండ్రులను తలుచుకొని ఏడ్చేవాడిని స్థానికులు చెప్పారు. ఈ క్రమంలో ఆదివారం బాగా మద్యం సేవించి రాత్రి పది గంటల ప్రాంతంలో భోజనం చేసి దగ్గరలో ఉన్న పంపుచెట్టు పక్కన కానుక చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## శేషవాహనంపై శ్రీరామచంద్రుడి దరహాసం



తవణంపల్లె, మార్చి 30 ప్రభాతవార్త: మండలంలోని అరగొండ శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీసీతా సమేతుడైన శ్రీరామచంద్రమూర్తి శేషవాహనంపై అరగొండ గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. ఆలయంలో ఈనెల 27 నుండి శ్రీరామనవమి ఉత్సవాలు జరుగుతున్న విషయం విధితమే. ఇందులో భాగంగా నాలుగవ రోజు సోమవారం స్వామివారికి శేషవాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి అరగొండ, పైమాఘంకు చెందిన ఆర్యవైశ్య కులస్థులు ఉభయ దారులుగా వ్యవహరించి ఉదయం ఆలయంలో అర్చకులు స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి,అలంకరించి ప్రత్యేకపూజలు చేసి దూప దీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం రాత్రి అర్చకుల పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు అలంకరించిన శేషవాహనంపై అధిరోహించి మంగళవాయిద్యాలు, బాణా సంచా పేలుళ్ళ నడుమగ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రసాద్‌స్వామి. ఉత్సవ నిర్వహకులు, ఉభయదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రూ.130 కోట్ల ఆస్తిని కాజేయడానికి ప్రయత్నం

### - పురాతన భవనాలు కూర్చిన వారిపై పోలీసు ఫిర్యాదు చేయరా!

### - బిసీ నేత బుల్లెట్ సురేష్ ఆరోపణ



చిత్తూరు, మార్చి 30 ప్రభాతవార్త: చిత్తూరు అర్టీసీ బస్టాండ్ అనుకుని వున్న 130 కోట్ల రూపాయల విలువైన థియోసాఫికల్ సొసైటీ భూములను కొంతమంది కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని బిసీ నేత బుల్లెట్ సురేష్ ఆరోపించారు. చిత్తూరులోని ఆయన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు రాత్రికి రాత్రే పురాతన భవనంను కూల్చివేస్తే ఇప్పటి వరకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఎందుకు పోలీసు ఫిర్యాదు ఇవ్వలేదని ప్రశ్నించారు. చిత్తూరులోని థియోసాఫికల్ సొసైటీలో స్వాతంత్ర్య సమరం జరిగే రోజుల్లో మహాత్మాగాంధీ, అనిబిసెంట్ తదితరులు వచ్చారని, అలాంటి చారిత్రాత్మక భవనంను కూల్చివేస్తే చిత్తూరులో అడిగే దిక్కులేక పోయిందన్నారు. సొసైటీ భూములను విక్రయించే హక్కు ఎవరు ఎవరికి ఇచ్చారనే విషయంను అధికారులు తేల్చాలన్నారు. 1913 సంవత్సరంలో ఈ స్థలంను మునస్వామి నాయుడు, అరుణాచలం మొదలియార్‌లు విరాళంగా ఇచ్చారని ఇలా ఇచ్చిన స్థలంను ఎలా విక్రయిస్తారని ఆయన ప్రశ్నించారు. చిత్తూరు నగరానికి చెందిన కొంతమంది నాయకులు, హైదరాబాద్‌కు చెందిన కొంతమంది రాత్రికి రాత్రి పురాతన భవనంను కూల్చివేశారన్నారు. ఈ భూమిలో కొంత భాగంను ఇద్దరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారని, వీరికి అడుగు భూమి 2,550 రూపాయలకు రిజిస్ట్రేషన్ చేస్తే సొసైటీ నాయకులు ఒక అడుగు 4 వేల రూపాయలకు బేరం కుదుర్చుకున్నారని ధ్వజమెత్తారు. ఈ సొసైటీ భూమి 60 వేల అడుగుల మేరకు వుందని వీటిని విక్రయిస్తే 130 కోట్ల రూపాయల వరకు వస్తుందన్నారు. ఇందులో సొసైటీలో వున్న వారికి అనధికారికంగా 10 కోట్ల రూపాయలు ఆదాయం లభిస్తుందన్నారు. ఈ భూములు అమ్ముకునే ముఠా సభ్యులకు వంద కోట్లకు పైగా లాభం వస్తుందన్నారు. సొసైటీ భూములను కొనుగోలు చేయకుండా అధికారులు పక్కాగా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## పార్టీని క్షేత్రస్థాయిలో తీసుకెళ్ళాలి

### -మోదీ పథకాలను వివరించాలి! -రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా



శ్రీకాళహస్తి,మార్చి 30 ప్రభాతవార్త: బిజెపి పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయాలి. నేడు ఏ రాష్ట్రంలో అయినా కేంద్రం అందిస్తున్న పథకాలే అమలు జరుగుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికే పెద్ద పీట వేస్తున్నారు. రాష్ట్రానికి ఆయన చేయూత ఎంతో ఉందని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానికంగా ఉన్న ఎన్వియస్ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన దీన్‌దయాళ్ మహాభియాన్ శిక్షణా కార్యక్రమాలకు కోలా ఆనంద్‌కుమార్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలను మొదటి రోజు సోమవారం పండిట్ దీన్ దయాళ్ శిక్షణ కార్యక్రమాలను ఆయన చిత్రపటానికి పూజలు నిర్వహించి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు కేంద్రంలోని ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గ్రామీణాభివృద్ధికి అత్యధిక ప్రాధన్యత ఇస్తున్నామన్నారు. పార్టీని గ్రామాల్లో బలోపేతం చేయటానికి కేంద్ర పార్టీతో పాటు రాష్ట్ర పార్టీ కూడా నిర్ణయం తీసుకుంది. అందుకే ప్రతి కార్యకర్త గ్రామీణ స్థాయి నుంచి ప్రజల్ని చైతన్య వంతుల్ని చేయాలన్నారు. ప్రజా సేవతో పాటు దేశాభివృద్ధి గ్రామీణాభివృద్దికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీకి గట్టి క్యాడర్ ఉంది. ప్రధాన పార్టీలకు దీటుగా సభ్యత్వం ఉందన్నారు.ఈ సందర్భంగా తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇతర ఏ పార్టీల్లోనూ లేని విధంగా బిజెపిలో కార్యకర్తలకు గుర్తింపు ఉందన్నారు. పని చేసే కార్యకర్తలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు వస్తుందన్నారు.ఈ సమావేశాల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ లక్ష్యాలను ప్రజలకు చేరవేస్తూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. ప్రజా సేవే పరమావధిగా ప్రజలకు అదికారులకు వారధిగా వ్యవహారించాలని సూచించారు.శిక్షణా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో దోహద పడతాయని వివరించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ అధ్యక్షుడు బి.చంద్రప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధి బీడి బాలాజి, జిల్లా ఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి మండల అధ్యక్షుడు ఆర్ హరీష్‌రెడ్డి, వేదం కృష్ణయ్య, బాగేత్ వెంకటేష్, పూజారి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, జీపాళెం తేజోవతి, తిరుమలశెట్టి నరేష్, సీనియర్ కార్యకర్తలు జీవి అమర్‌నాథ్, చాగణం శైలజ, కె. ప్రసాద్, కన్నా వెంకటేశ్వర్లు, ప్రజ్ఞాశ్రీ కూనాటి నాగరాజు, కొండేటి గోపాల్, రామ్ ఉమాసింగ్ లింగాబత్తిన గోపాల్, పి.ధర్మయ్య, ఇమ్మిడిశెట్టి మోహన్, రమణరెడ్డి, మద్దు వాసుయాదవ్,పుణ్యం ఢిల్లి కుమార్, జి.యతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు టౌన్‌బ్యాంకు సమావేశం

శ్రీకాళహస్తి,మార్చి 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు మహాజన సభ మంగళవారం ఏర్పాటు చేసినట్లు చైర్మెన్ షేక్ ఖాదర్‌బాషా, సిఇఓ ధనంజయులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త పాలకమండలి నియమించిన తరువాత జరుగుతున్న మొదటి మహాజన సభ ఇది. ఈ సమావేశాన్ని ముత్యాలమ్మగుడివీధిలోని టౌన్‌బ్యాంకు మిద్దెమీద ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యే సమావేశంకు సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు. సమావేశంలో స్వల్ప కాలంలో తీసుకున్న అభివృద్ధి కార్యక్రమాలు,అభివృద్ధి వివరిస్తామన్నారు. ఉదయం 9గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని వివరించారు.,

## సీనియారిటికి సత్కారం... చంద్రబాబుచే అభినందన

### శ్రీకాళహస్తి నుంచి ఇద్దరు




శ్రీకాళహస్తి,మార్చి 30 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకుడు చంద్రబాబునాయుడు, లోకేష్‌లు సీనియర్లను సత్కరించాలని నిర్ణయించారు.ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 50 మందిని ఎంపిక చేసారు., ఇందులో శ్రీకాళహస్తి నుంచి ఓ మహిళ, మరో పురుషుని ఎంపిక చేసారు. పార్టీ ఆవిర్బావం నుంచి పార్టీలో ఉంటూ సేవలందిస్తున్న వారిని సత్కరించాలని భావించారు. శ్రీకాళహస్తి నుంచి మహిళల తరఫున బూడిదవాకం రేణుకమ్మను ఎంపిక చేసారు. మరో వ్యక్తి తీర్థం వెంకటేశ్‌లను ఎంపిక చేసారు. కాగా శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి 20 మందిని సత్కరించారు.అలాగే మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు మరి కొందరిని సత్కరించారు.

**రేణుకమ్మ సేవలకు సత్కారం:**

శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీలో బూడిదవాకం రేణుకమ్మ ఎంతో జవాబుదారి తనంతో పని చేస్తున్నారు. బొజ్జల కుటుంబానికి విధేయురాలుగా ఉంటున్నారు.పార్టీ అవిర్బావం నుంచి పార్టీలో ఉంటున్న ఆమె కౌన్సిలర్‌గా ఐదేళ్ళ పాటు పదవిని అనుభవించారు. ఆమె హయాంలో వార్డును అభివృద్ది పరచారు. కాగా తరువాత శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యురాలుగా, ముత్యాలమ్మగుడివీధిలోని ముత్యాలమ్మ ఆలయ చైర్మెన్‌గా ఎన్నో అభివృద్ది కార్యక్రమాలను నిర్వహించారు.ఇక శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో తెలుగుమహిళా అధ్యక్షురాలిగా పదవులను అనుభవించారు. అంతేకాక పార్టీకి,బొజ్జల కుటుంబానికి విదేయులుగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళటంలో ఆమె కీలకంగా వ్యవహారించారు. ఆమె పార్టీ అధికారంలో లేనపుడు కూడా పార్టీ కార్యక్రమాలను నిర్వహించటంలో తమ బాధ్యతను నిర్వర్తించారు. ఈ నేపధ్యంలోనే ఆమె కొంత కాలం ఓ ప్రధాన దినపత్రికలో జర్నలిస్టుగా పని చేసారు. ఆమె పార్టీ సేవలను గుర్తించిన పార్టీ అధిష్టాన వర్గం ఆమెను సత్కరించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,నారాలోకేష్‌లు సత్కరించి ఆమెకు మెమెంటో అందించారు.

## గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ పార్థసారథికి ఘన సన్మానం



రైల్వేకోడూరు రూరల్, మార్చి 30 ప్రభాతవార్త: రైల్వే కోడూరు ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా మహిళ ఉపాధి కోసం మహిళలకు టైలరింగ్ ద్వారా శిక్షణ ఇచ్చి వారి జీవన ఉపాధి కొరకు పాటుపడుతున్న గ్లోబల్ ట్రస్ట్ చైర్మన్ పార్థసారధిని సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే శ్రీధర్ మరియు డిసిఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్ తోపాటు జనసేన అధినేత తతంశెట్టి నాగేంద్రలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్థసారథి చేసిన సేవలను గుర్తిస్తూ వారికి ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముక్క సాయి వికాస్ రెడ్డి, ఎంపీడీవో జయశ్రీ, తాసిల్దార్ అమర్నాథ్, వెలుగు ఏపిమ్ వసుంధర తో పాటు పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన సీఐ



చిట్వేలి, మార్చి 30, ప్రభాతవార్త : స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని రైల్వే కోడూరు రూరల్ సీఐ డి.శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. తాను మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా జరిగే విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని స్థానిక పోలీసులకు సూచించారు. ఎలాంటి కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పరీక్ష కేంద్రం సమీపంలో గుంపులు చేరకుండా, ఇతరులు లోనికి ప్రవేశించకుండా పటిష్ట భద్రతా చర్యలను చేపట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రశాంతంగా పరీక్ష రాసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ స్థానిక పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో రైటర్ రామకృష్ణ, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిమెంట్‌రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే



చిట్వేలి, మార్చి 30 ప్రభాతవార్త: రైల్వే కోడూరు శాసనసభ్యుడు అరవ శ్రీధర్ నియోజకవర్గ టిడిపి బాధ్యుడు కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డితో కలిసి సోమవారం స్థానిక మండల పరిధిలోని పలు గ్రామాలలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా రాజుకుంట గ్రామంలో సచివాలయాన్ని, స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. అనుంపల్లి గ్రామంలో 65 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డుకు భూమి పూజ, 15 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. కే కందులవారిపల్లి గ్రామం నందు నూతనంగా నిర్మించిన పశువైద్యశాలను, విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభించారు. ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని వారన్నారు. ప్రతి గ్రామానికి సిమెంట్ రోడ్లు, త్రాగునీరు మౌలిక వసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, ముక్కా సాయి వికాస్ రెడ్డి, ఎంపీటీసీ నానబాల నాగార్జున, సర్పంచ్ గుత్తి నరసింహ, మాదాసు నరసింహ, మన్మధ, జిలకర మురళి, ఎమ్మార్వో స్పందన, ఎంపీడీవో శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, సంబంధిత గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆనకట్ట పనులు పరిశీలించిన అధికారుల బృందం

పుల్లంపేట, మార్చి 30 ప్రభాతవార్త: పుల్లంపేట మండలంలోని జలధార ప్రాజెక్టు పథకం కింద చేపట్టిన పనులను అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు క, డా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్ ఇ వేణుగోపాల్ జె.ఎన్.టి.యు యూనివర్సిటీ విజయనగరం ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమోళి ఆధ్వర్యంలో పనులను పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జలదార ప్రాజెక్టు పనులు నాణ్యతతో చేపట్టి పంట కాలువలకు నీరు వచ్చే విధంగా పనులు పూర్తిచేసి నందుకు రైతులకు తీపి కబురు లాంటిదన్నారు ఈ పనుల వల్ల చెరువులన్నిటికీ పుష్కలంగా నీరు చేరి జలకలతో కలకలలాడ తాయన్నారు మిగిలిన తూములు అలుగులు కాలువ పనులు కూడా పూర్తి చేసే విధంగా నివేదికలను సిద్ధం చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండల తెలుగుదేశం బాధ్యుడు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు ఇ ఇ రేవతి డిఇ మురళీకృష్ణ ఏ ఇ ఇ భవిత హంద్రీనీవా ఎస్ ఇ విట్టల్ ప్రసాద్ ఎస్ ఈ వెంకట్రామయ్య డిడి గ్రౌండ్ వాటర్ సువర్ణ కుమార్ డ్వామా పీడీ వెంకటరత్నం ఏపీవో శ్రీనివాస్ అగ్రికల్చర్ ఏవో ప్రవీణ్ కుమార్ జేఎన్టీయూ ప్రొఫెసర్ ఫణింద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పైపులైన్ పగలగొట్టినందుకు ఫిర్యాదు



పుల్లంపేట, మార్చి 30 ప్రభాతవార్త : మండల కేంద్రమైన పుల్లంపేట బైపాస్ రోడ్డు లోని పైపులైను ఉడుము వారి పల్లి గ్రామానికి చెందిన గడ్డం సురేంద్ర నాథ్ రెడ్డి పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన పైపులైను, రోడ్డును తవ్వి పైపులను పగలగొట్టారని పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసుల రెడ్డి పంచాయతీ కార్యదర్శి ఇరువురు పుల్లంపేట పోలీస్ స్టేషన్ లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు పైపులు పగిలిన ప్రదేశాన్ని పరిశీలించారు.

## నేడు సర్పంచులకు సన్మానం...



రైల్వే కోడూరు రూరల్, మార్చి 30 ప్రభాతవార్త :రైల్వే కోడూరు మండలంలో ఉన్న 21 గ్రామ పంచాయతీల సర్పంచులను ఘనంగా మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి సీనియర్ నేత మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న మండలంలో ఉన్న సర్పంచులు అందరికీ సన్మానం చేసి వారి సేవలను స్మరించుకునే విధంగా స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన విలేకరులకు తెలియజేశారు.

## కరుణాకర్ మరోసారి...
## లోకేష్‌పై మాట్లాడితే సహించేది లేదు : బొజ్జల




శ్రీకాళహస్తి,మార్చి 30 ప్రభాతవార్త: తిరుపతి మాజీ శాసనసభ్యుడు టిటిడి చైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి యువ నాయకుడు విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌పై అవాక్కులు, చెవాక్కులు పేలుతున్నారని మరో సారి నోరుమెదిపితే సహించేది లేదని ఘాటుగా సమాధానం చెప్పాల్సి వస్తుందని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం రాత్రి పంచాయతీరాజ్ అతిది గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్దిని ఓర్చుకోలేక పిచ్చిపట్టినట్లు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతున్నారన్నారు. తిరుపతి అభివృద్ధి ముసుగులో ఓబ్రాయ్ హోటల్ నిర్మాణానికి రూ.,వెయ్యి కోట్లు ఆస్తిని కేవలం 97కోట్లకు దారాదత్తం చేసిన వైకాపా నాయకుడు నారాలోకేష్ మాట్లాడిన సత్యాంను జీర్ణించుకోలేక పోవటం శోచనీయం అన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాల్సిన కరుణాకర్‌రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. గతంలో వైకాపా మద్యం విధానాలకు అన్‌లైన్ చేయలేదని ప్రశ్నించారు. తిరుపతి ప్రజల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన వెల్నెజ్ సెంటర్లను మసాజ్ సెంటర్స్‌గా అభివర్ణించటం ఆయన విజ్ఞతకే వదలిపెడుతున్నామని సుధీర్ రెడ్డి ధ్వజమెత్తారు.

## గుడిమల్లం హుండీ ఆదాయం రూ.2.16లక్షలు



ఏర్పేడు,మార్చి 30 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో భక్తులు 40 రోజుల లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. గతంలో అసలు హుండీ ఆదాయాల్లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చైర్మెన్ బత్తల గిరినాయుడు చొరవతో హుండీలను ఏర్పాటు చేసారు.హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా మొత్తం రూ.2లక్షల 61వేల 015లు వచ్చినట్లు ఇఓ రామచంద్రారెడ్డి వివరించారు. కాయిన్స్ రూ.12,377లు వచ్చినట్లు తెలిపారు.వెరసి రూ.2లక్షల 73వేల వచ్చినట్లు వివరించారు.

## బార్ కార్యదర్శిని సత్కరించిన కోలా

శ్రీకాళహస్తి,మార్చి 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ సహాయకార్యదర్శిగా ఎంపికైన మునిశేఖర్‌ను సోమవారం రాష్ట్రబిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ సత్కరించారు. ఇటీవల బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయనను కోలా అనందకుమార్ సత్కరించారు. బార్ అసోసియేషన్ న్యాయవాద వృత్తి కీలకమైనదన్నారు.నిరుఏపేదలకు న్యాయాన్ని అందించుటకు న్యాయవాదులు కృషి చేయాలన్నారు.

## చక్రేశ్వరస్వామికి గోదానం



తొట్టంబేడు,మార్చి 30 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం నెల్లిమాను కండ్రిగలో వెలసిన చండికా పరమేశ్వరి సమేత చక్రేశ్వరస్వామి దేవాలయానికి సోమవారం గోదానం చేసారు.ఈ దానాన్ని కనుపర్తి ధనంజయులు శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ద్వారా అందజేసారు.ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి అందజేసారు.